ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

శుక్రవారం 10 జనవరి 2025



3



దక్షిణావృత శంఖు



విద్యుద్దీపాలంకరణలో ఉత్తర గాలిగోపురం

నేడు మంగళగిరి నృసింహుని ఉత్తర ద్వార దర్శనం

- దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థప్రసాదాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

6లో



రుణాల.. మాఫీయా

డీసీసీబీని కొల్లగొట్టిన భోక్తలు

- 17 సహకార సంఘాల్లో అక్రమాలు
- రూ.220 కోట్లు మింగేసిన అక్రమార్కులు
- ప్రత్తిపాడు పరిధిలో 11 మంది రైతుల అరెస్టు
- 21 మంది మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లకు కష్టకాలం

గుంటూరు సిటీ, జనవరి 9 (ఆంధ్ర జ్యోతి): రైతుల కోసం.. వారి సేవలో ఉండాల్సిన గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(జీడీసీసీబీ)ను అక్రమార్కులు కొల్లగొట్టేశారు. అక్రమార్కులు మాఫియాగా మారి నకిలీ రైతుల పేరుతో రూ.కోట్లలో రుణాలను పొందగా.. వారికి అధికారులు సహకరించారు. గతంలోనూ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేసిన రుణమాఫీ పథకంలో కూడా అక్రమాలు చోటు చేసుకున్నాయి. గత ఐదేళ్ల యథేచ్ఛగా చెలరేగిన అక్రమార్కులకు కష్టకాలం మొదలైంది. విభజిత గుంటూరు జిల్లాలోనే డీసీసీ బ్యాంకుకు చెందిన సుమారు రూ.220 కోట్లు కొందరు నేతలు, ఉద్యోగులు, నకిలీ రైతుల పేర్లతో పక్కదారి పట్టించిన విషయం విదితమే. జిల్లాలోని 17 సహకార సంఘాల్లో అక్రమాలు చోటుచేసు కోగా 184 మంది రైతులు, 21 మంది డీసీసీబీ మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు ఉన్నట్లు సహకార శాఖ తేల్చింది. ప్రత్తిపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన 11 మంది నకిలీ రైతులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పాసు పుస్త కాలు, ఆధార్ కార్డులు, ఇతర పత్రాలు సృష్టించి రూ.5 కోట్ల వరకు కొల్లగొట్టి నట్లు పోలీసులు తేల్చారు. డీసీసీబీ అక్రమాలపై 18 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. క్షేత్రస్థాయిలో కనీస పరిశీలన లేకుండానే రుణాలు మంజూరుతో అక్రమాలకు తెరలేచింది. డీసీసీబీ పాలకవర్గంలో కీలక పాత్ర పోషించిన నేతలు, సీఈవో, మేనేజర్లు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల కార్యదర్శులు, తహసీల్దార్లు, వీఆర్వోలు ఈ అక్రమాల్లో భాగస్వాములుగా ఉన్నారని

(మిగతా 6వ పేజీలో)

డీసీసీబీ అక్రమాలపై సెక్షన్ 51 విచారణ

గుంటూరు సిటీ: గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అక్రమాలపై సెక్షన్ 51 విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా అదనపు రిజిస్ట్రార్ ఎన్‌వీఆర్ ఆనందబాబును నియమిస్తూ రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ బాబు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. బ్యాంకు వ్యవహారాలపై ఫిర్యాదులు, నిధులు దుర్వినియోగం, రుణాల మంజూరులో మోసపూరిత కార్యకలాపాలపై విచారణకు ఆదేశించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శ్రీహరినాయుడి అనే వ్యక్తి ఫిర్యాదులతో విచారణకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. శ్రీహరినాయుడు పేర్కొన్న ఆరోపణలు చాలావరకు నిజమని తేలిందని వెల్లడించారు. అక్రమాలను దాచడంలో సీఈవో పాత్రపై కూడా ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. అక్రమాలపై 2023 మార్చి 31న నాబార్డు అధికారుల నివేదికలో పేర్కొన్న అంశాలను కూడా ఈ ఉత్తర్వుల్లో ఉటంకించారు.

నకిలీ పాస్ పుస్తకాలతో..

రూ.5 కోట్లు స్వాహా

- నిందితుల్లో విశ్రాంత తహసీల్దారు, బ్యాంకు మేనేజర్

గుంటూరు: గతంలో ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో చోటుచేసుకున్న అక్రమాలపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు సృష్టించి రూ.5 కోట్ల రుణాలు స్వాహా చేసిన ఘటనపై గత ఏడాది సెప్టెంబరు 18న ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేయగా గురువారం 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. అరెస్టు అయిన వారిలో డీసీసీబీ ప్రత్తిపాడు బ్రాంచ్ మేనేజర్ బొల్లినేడి రవికుమార్, గతంలో చిలకలూరిపేట మండలం కావూరు సొసైటీ కార్యదర్శిగా పనిచేసిన సోమేపల్లి నాగరాజు, వినుకొండలోని ఓ డిగ్రీ కళాశాల పీఆర్వో బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన తిరువీధి యోగయ్య, శావల్యాపురం మండలం కనమర్లపూడికి చెందిన ముంద్రు సీతారామాంజనేయులు అలియాస్ ఆంజనేయులు, వినుకొండలోని

(మిగతా 6వ పేజీలో)

రైతు సంక్షేమానికి, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం

- సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు

4

వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి

నేడు గుంటూరుకు చంద్రబాబు



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

- సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం గుంటూరుకు రానున్నారు. స్థానిక స్తంభాలగరువులోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో మూడు రోజులు జరిగే నరెడ్కో ప్రాపర్టీ షో శుక్రవారం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన దృష్ట్యా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. రింగ్ రోడ్డులోని శ్రీకన్వెన్షన్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, ఏఎస్పీ సుప్రజ, వెస్ట్ డీఎస్పీ మెహర్‌జయరాం ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, ఈఈ విశ్వనాథరెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్‌డీ నాగమల్లేశ్వరరావు, సీఎంవోహెచ్ డాక్టర్ అమృత, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, నగేష్ , నరెడ్కో ప్రాపర్టీ షో ఛైర్మన్ గద్దె తిరుపతిరావు, ప్రెసిడెంట్ నాగవంశి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యం

● సాగర్ కుడికాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు

సత్తెనపల్లి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్ కాలువల అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అన్నారు. గురువారం స్థానిక ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో ప్రాజెక్టు కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం పలుకూరి అధ్యక్షతన నిర్వహించారు. చివరి భూముల వరకు నీరు అందేలా చూడాలని, అమరావతి మేజరు కాలువ కింద భూములకు నీరు సక్రమంగా అందటం లేదని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు బీ వెంకటేశ్వరరావు, వడ్లమూడి అప్పారావులు చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. పలు కాలువ కట్టల పై పిచ్చి చెట్లు మొలచి ఉన్నాయని, వాటిని తొలగించాలని, కాలువ కట్టలను బలోపేతం చేయాలని కోరారు. మరో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పులిమి రామిరెడ్డి మాట్లాడుతూ కాలువల అభివృద్ధి పనులను డీసీలకు అప్పగించాలని కోరారు. బండారుపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మధుసూదనరావు మాట్లాడుతూ తమ ప్రాంతంలో కాలువల పై ఎన్‌ఎస్‌పీ అధికారులు పర్యటించటం లేదని, కాలువ చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని కాలువల్లో పూడిక తీత పనులు చేయించాలని, ఖాళీగా ఉన్న ఎన్‌ఎస్‌పీ లస్కర్ పోస్టులను భర్తీ చేయాలని 22వ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మన్నవ శ్రీనివాస్ కోరారు. డీసీ చైర్మన్‌లు ప్రస్తావించిన సమస్యలపై పలుకూరి మాట్లాడుతూ నాగార్జున కాలువ పరిధిలోని చివరి భూముల వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.



నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ పులుకూరి కాంతారావు తదితరులు

సమావేశంలో జిల్లాల వారీగా, డివిజన్‌ల వారీగా వివరాలను అధికారులు అందించారు. డివిజన్‌ల వారీగా కాలువలపై జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి సమావేశంలో చర్చించారు. 2025 - 26 సంవత్సరంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువను సక్రమంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. ప్రస్తుతం సాగర్ డ్యామ్‌లోని నీటి లభ్యతను బట్టి అనుసరించాల్సిన నీటి నియంత్రణ పద్ధతులు వారాబంది అమలు ఆవశ్యకతపై చర్చించారు. పొరుగు సేవల పద్ధతిలో లస్కర్ల నియామకం, తూముల వద్ద గ్రిల్స్ ఏర్పాటు, జిల్లా సరిహద్దులోని నీటి నియంత్రణ ప్రణాళిక గురించి చర్చించారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, గోగినేని కోటేశ్వరరావు, పసుపులేటి పాపిరెడ్డి, ఎన్‌ఎస్‌పీ ఈఈ మురళీధర్, ఒంగోలు ఎస్ఈ రామకృష్ణ, వినుకొండ ఈఈ ప్రేమ్ కుమార్, లింగంగుంట్ల సెక్షన్ ఈఈ సుబ్బారావు, పలు ఎన్‌ఎస్‌పీ సబ్ డివిజన్‌ల ఏఈలు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నారాయణ, డాక్టర్ సేవకుమార్ తదితరులు

69,119 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 70,712 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 69,119 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 54,442 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14500	334	7400	14000
నంబరు. 5	8500	14500	నంబరు. 5	8800	8800
273	9000	12000	273	9000	11000
341	8000	15000	341	8500	13200
4884	11000	11000	4884	–	–
సూపర్ 10	–	–	సూపర్ 10	11000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7300	16000	తేజ	7500	15500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	7500	12500
దేవనూరుడీలక్స్	9000	14500	దేవనూరుడీలక్స్	–	–
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	10000

తిరుపతి విషాదంపై క్షుద్ర రాజకీయాలు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట విషాదంపై కనీస మానవత్వం లేకుండా జగన్ క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. తిరుమల ఘటనలో ప్రభుత్వ వైఫల్యం, ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యుడంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం జీవీ ఆంజనేయులు గురువారం తీవ్రంగా స్పందించారు. తిరుపతిలో జరిగిన దుర్ఘటన ముమ్మాటికీ అందర్నీ కలచివేసిందన్నారు. ప్రభుత్వం కూడా అంతే వేగంగా స్పందించి చర్యలు చేపట్టిన విషయాన్ని విస్మరించడం జగన్ నైజాన్ని బయట పెడుతోందన్నారు. జగన్ అంటేనే శవ రాజకీయాలకు చిరునామా అని, శవం కనిపిస్తే రాబందులా వాలిపోవడం ఒకటే జగన్‌కి తెలిసిన రాజకీయం అని ప్రస్తుత పరిణామాలతో మరోసారి నిరూపితం అవుతోందన్నారు. తిరుపతి ఘటన జరిగిన వెంటనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తిరుపతికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారని, తప్పు అధికారుల స్థాయిలో జరిగింది కాబట్టే వారిపై చర్యలు తీసుకున్నారని అన్నారు. జగన్, వైసీపీ నేతల స్పందనలో ప్రభుత్వంపై బురదజల్లాలన్న వారి ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు బాధ్యతతోనే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ బాధితుల్ని పరామర్శించారని, రూ.25లక్షల పరిహారం ప్రకటించారని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

తిరుమల ఘటన బాధాకరం : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం విచారం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే అధికారులు స్పందించి గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారన్నారు. జరిగిన మొత్తం ఘటనలో ఏదో కుట్రకోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి

యడ్లపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విచారణకు వెళ్లిన వక్ఫ్ బోర్డు అధికారిపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపాలెం గ్రామ పరిధిలోని హజరత్ బురావుద్దీన్ దర్గాకు 87.20 ఎకరాల భూమి ఉంది. సదరు భూమిని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించి రైతులకు కౌలుకు ఇస్తుంటారు. అయితే గత మూడేళ్లుగా కౌలుదారులు ఎవరూ కౌలు చెల్లించడం లేదు. దీంతో వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆదేశాలతో 87.20 ఎకరాల వక్ఫ్ బోర్డు భూములకు ఇటీవల బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. ఈ వేలంలో షేక్ హుస్సేన్ అనే వ్యక్తి భూములను దక్కించుకున్నాడు. గతంలోని కౌలుదారుల్లో కొందరు కౌలు రద్దు చేయాలని వక్ఫ్ బోర్డు అధికారులపై రాజకీయపరమైన ఒత్తిడి తెచ్చారు. దీంతో చైర్మన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు ఆడిట్ ఇన్‌స్పెక్టర్‌ను భూమికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం పొలం వద్దకు వచ్చిన ఇన్‌స్పెక్టర్ పొలంలోని పంటలను, అందులోని నిర్మాణాలను ఫొటోలు తీస్తుండగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కాకర్లపూడి మాధవరావు మరో ఐదుగురితో కలిసి అక్కడకు వచ్చి ఫొటోలు ఎందుకు తీస్తున్నావు అంటూ ప్రశ్నించాడు. తాను ముజావర్ల నుంచి 5 ఎకరాలు కొనుగోలు చేశానని, ఈ భూమి తనదనీ, ఎందుకు ఫొటోలు తీస్తున్నావు అంటూ అసభ్యంగా తిడుతూ దాడికి పాల్పడ్డారు. సెల్‌ఫోన్ లాక్కుని పగలగొట్టడమే కాకుండా భూమి వైపు వస్తే చంపేస్తామంటూ కర్రలతో వెంటపడ్డారు. జరిగిన విషయాన్ని వక్ఫ్ బోర్డు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ యడ్లపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 566.00 అడుగులు ఉంది. ఇది 246.53 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 20,137 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,137 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

చిలకలూరిపేటలో రామ్‌రాజ్ షోరూం ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో పేరెన్నికగన్న రామ్‌రాజ్ కాటన్ షోరూం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని గుండయ్యతోటలో ఏర్పాటైంది. గురువారం చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఈ షోరూంను లాంఛనంగా ప్రారంభించగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంయుక్త కార్యదర్శి మైలవరపు కృష్ణతేజ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు సీఏ పెనుగొండ సుబ్బారాయుడు జ్యోతిప్రజ్వలన చేయగా, చిలకలూరిపేట విద్యా సంఘం కార్యదర్శి మైలవరపు వీఎస్ శివానందకుమార్ తొలి విక్రయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. భారతదేశ అత్యంత విశ్వసనీయ, అత్యంత ఆకర్షణీయమైన బ్రాండ్ జాబితాలో రామ్‌రాజ్ స్థానం పొందడం హర్షణీయమని పేర్కొన్నారు. ధోతీలు, చొక్కాలు వంటి తెల్లదుస్తుల విక్రయాల్లో తమ సంస్థ గణనీయమైన ముందడుగు వేసిందని వివరించారు.


రామ్ రాజ్ కాటన్ షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

12న 'కౌండిన్య' ట్రస్ట్ ఉపకార వేతనాల ప్రదానోత్సవం

గుంటూరు మెడికల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 19వ ఉపకార వేతన ప్రదానోత్సవం ఈ నెల 12న పెదకాకాని మండలం వెనిగండ్ల శివార్లలోని కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవన్‌లో జరుగుతుందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో సమావేశ మందిరంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 10వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు చదువుతున్న ప్రతిభ గల 555 మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు రూ.22 లక్షల ఉపకార వేతనం అందిస్తున్నట్లు డాక్టర్ నారాయణ తెలిపారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడు వేల మంది విద్యార్థులకు రూ.2.10 కోట్ల ఉపకార వేతనం అందించినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీతో పాటు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ తరఫున అన్ని పోటీ పరీక్షలకు అతి తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. 12వ తేదీన జరిగే ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ అమర్నాథ్ గౌడ్ హాజరౌతారని ఆయన తెలిపారు. ఈ సందర్భం గా దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నారాయణ ఆవి ష్కరించారు. కార్యక్ర మంలో డాక్టర్ టి.సేవకుమార్ తదిత రులు పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామిగా సంగం డెయిరీ

పొన్నూరుటౌన్, జనవరి 9: దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రగామిగా సంగం డెయిరీ నిలుస్తోందని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రూపేంద్ర సింగ్ సోధీ అన్నారు. బెంగళూరులో ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్ జోన్ సదరన్ సమ్మిట్ గురువారం జరిగింది. ప్రాంతీయ డెయిరీ కాన్ఫరెన్స్ ఈవెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల నుంచి సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఎండీ పి.గోపాలకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేంద్రకుమార్, ఎండీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఇండియన్ డెయిరీ అసోసియేషన్ కార్యక్రమాలకు సంగం డెయిరీ మద్దతు ఇస్తుందన్నారు. డెయిరీరంగంలో తాజా పరిణామాలు తెలుసుకోవడానికి ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందన్నారు. దక్షిణాది ప్రాంతంలో డెయిరీ రంగం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, దక్షిణాది రాష్ట్రాల ప్రముఖ డెయిరీల నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షుడు రూపేంద్ర సింగ్ సోధీ

నేటి నుంచి నరెడ్కో మెగా ప్రాపర్టీషో - 2025

● హాజరుకానున్న సీఎం చంద్రబాబు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): నరెడ్కో కాపిటల్ జోన్, గుంటూరు నిర్వహించబోయే 12వ మెగా ప్రాపర్టీషో ఈ నెల 10, 11, 12 తేదీలలో చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు గురువారం వెల్లడించారు. ఈ మేరకు ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నట్లు వివరించారు. ప్రాపర్టీ షోలో మంత్రి నారాయణ, లోకల్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు కూడా అతిథులుగా పాల్గొననున్నారు. జనవరి 12న ప్రాపర్టీషో ముగింపు కార్యక్రమం జరగనుందన్నారు. నరెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీ షోలో 150 స్టాల్స్ ఏర్పాటుచేశామని, వీటిలో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ నాగవంశీ, సెక్రెటరీ శ్రీనాథ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ-ఫైలింగ్ పై అవగాహన తప్పనిసరి: జడ్పీ సీఈఓ

గుంటూరు సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కాగిత రహిత పరిపాలనకు ప్రభు త్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఉద్యోగులకు ఈ-ఫైలింగ్ పై అవగాహన తప్పని సరని జిల్లా పరిషత్ సీఈఓ వీ జ్యోతి బసు అన్నారు. గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఈ-ఫైలింగ్‌పై ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్య క్రమం నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ త్వరలో అన్ని విభాగాల్లో పేపర్ లెస్ విధానం అమలు కానున్నట్లు చెప్పారు. ఉద్యోగులు కూడా దానికి అనుగుణంగా సిద్ధ పడాలని సూచించారు.

2025 -డైరీల టెండర్ ఖరారు

గుంటూరు జిల్లా పరిషత్ 2025 టెండర్ ప్రక్రియ గురువారం జరిగింది. జడ్పీ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ ఈ ప్రక్రియను నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు టెండర్లు స్వీకరించారు. అనంతరం తక్కువ ధరకు కోడ్ చేసిన విజయవాడకు చెందిన వీజీఎస్ సంస్థకు డైరీ ముద్రణ టెండర్ ఖరారు చేశారు.

'వైసీపీ నేతల వ్యాఖ్యలు హేయం'

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై వైసీపీ నేతల వ్యాఖ్యలు హేయమని హిందూ దేవాలయాల ధర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దర్శనపు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీని పవిత్రతను అన్ని విధాలా దెబ్బతీసిన వైసీపీ నేతలు తిరుపతి ఘటనపై మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శించారు.



రిషబ్ ఓస్వాల్‌కు చెక్కును అందజేస్తున్న మట్లుపల్లి మోహన్

సీఏ ర్యాంకర్ రిషబ్ ఓస్వాల్‌కు సత్కారం

గుంటూరు(విద్య),జనవరి 9(ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన రిషబ్ ఓస్వాల్‌ను మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కామర్స్ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని, ఐఐటీ, నీట్ రాసే విద్యార్థులు లక్షల్లో ఉంటున్నారని, ర్యాంకులు మాత్రం పరిమితంగా వస్తున్నాయని తెలిపారు. సాధారణ విద్యార్థులు సైతం కామర్స్ కోర్సులు ఎంచుకుని ప్రణాళిక బద్ధంగా చదివితే కోర్సు పూర్తిచేయడం సాధ్యమేనని అన్నారు. ఈ సందర్భంగా రిషబ్‌కు రూ. లక్ష పారితోషికాన్ని మట్టుపల్లి మోహన్ అందజేశారు.



విద్యార్థిని అభినందిస్తున్న మాజీ ఎంపీ శివాజీ, విష్ణువర్ధన్ తదితరులు

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సీతారామయ్య హైస్కూల్ చిన్నారి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆల్టర్నేట్ ఫుట్ రోప్ స్కిప్ అంశంలో పాటిబండ్ల సీతారామయ్య హై స్కూల్ సీబీఎస్ఈ పాఠశాలలో యూకేజీ చదువు తున్న చిన్నారి కడియం ఎలినా రాయ్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో రికార్డును సాధించినట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ గురువారం తెలిపారు. ఐదు సంవత్సరాల ఒక నెల మూడు రోజుల వయసులో గరిష్ఠ సంఖ్యలో 95 ప్రత్యామ్నాయ ఫుట్ రోప్ స్కిప్‌లను 30 సెకండ్లలో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివాజీ, పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ విద్యార్థిని అభినందించారు.



విజేతలతో సరస్వతి దేవి, గజల్ శ్రీనివాస్, నాయుడు గోపి

ఎయిడ్స్‌పై జాగృతం చేసేందుకు కళారూపాలు

గుంటూరు మెడికల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలను జాగృతం చేసేందుకు కళలు, కథా రూపాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆంధ్రప్రదేశ్ స్టేట్ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సరస్వతి దేవి తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో మారుతీ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కథల జాతీయ స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవ సభ గురువారం నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.ఈ పోటీలకు న్యాయ మూర్తిగా ప్రముఖ సినీ గేయ రచయిత రస రాజు వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పీ రామచంద్రరాజు, మారుతీ మహిళా సొసైటీ అధ్యక్షురాలు ఎల్ సునీత, సినీ నటుడు నాయుడుగోపీ పాల్గొన్నారు.

ఐసీటీసీలో సంక్రాంతి సంబరాలు

ప్రభుత్వ సమగ్రాస్పత్రి వాలంటరీ కౌన్సెలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జయలీలోష్ణ లక్ష్మీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ బాధితులు పది మందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

'తూర్పు'ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే నసీర్

● రూ.77.45 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, ప్రభుత్వ సహకారంతో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 77.45 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారం అవుతున్నాయని, ప్రతి గడపలో సంతోషాల హరి విల్లు తీసుకురావడమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సాయికృష్ణ నగర్‌లోని రెండో లైన్ నుంచి ఐపీడీ కాలనీ మెయిన్ రోడ్డు వరకు రూ. 58 లక్షలు, రెడ్ల బజారు 3వ లైన్‌లో రూ.9.50 లక్షలు, సోడా బజారులో రూ.9.95 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మారుమూల ప్రాంతాల రోడ్లకు కూడా మహర్దశ పడుతుందని, అది ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకురి శీను, సురే శీను, ఈర్ల గురవయ్య, హరి కృష్ణ పాల్గొన్నారు.



సీతమ్మ కాలనీ మెయిన్ రోడ్డులో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాధవి

'పశ్చిమ'ను నంబర్ వన్ చేస్తా : ఎమ్మెల్యే మాధవి

● రూ.94 లక్షలతో సీసీ రోడ్డు, అప్రోచ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని త్వరలోనే మౌలిక వసతుల కల్పనలో నంబర్ వన్‌గా చేసి తీరుతామని ఎమ్మెల్యే గళ్లా మాధవి భరోసా ఇచ్చారు. స్థానిక 28వ డివిజన్‌లోని సీతమ్మకాలనీ మెయిన్ రోడ్డులో రూ.94 లక్షలతో 695 మీటర్ల సీసీ రోడ్డు, అప్రోచ్‌ల నిర్మాణానికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియో జకవర్గంలో నలుమూలలా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో 'అభివృద్ధి' అనే మాటకు గత వైసీపీ ప్రభుత్వం పాతర వేసిందని విమర్శించారు. నియోజకవర్గంలో అన్ని చోట్ల రోడ్లు, డ్రైన్లు పూర్తి చేసి, ఇంటింటికీ తాగునీటిని అందిస్తామన్నారు. సీసీ రోడ్డు, అప్రోచ్‌ల నిర్మాణాలను నెల రోజుల లోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. శ్యామలానగర్ ఆర్‌యూబీకి నిధులు మంజూరు అవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అప్పారావు యాదవ్, కసుకుర్తి హనుమంతరావు, మామిడి రామారావు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

●జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు



ఇన్నర్ రింగ్ రోడ్డులో పర్యటిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సచివాలయ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో బాధ్యతతో విధులు నిర్వహించాలని, రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలి దశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. స్థానిక కోబాల్ట్‌పేట, పట్టాభిపురం, తారకరామనగర్ ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. సచివాలయ కార్యదర్శులకు, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు స్థాని కంగా ఎదుర్కొనే పారిశుధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సమస్యలపై సచివాలయ కార్యదర్శులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. తారకరామనగర్ రోడ్డు విస్తరణ పనులకు ఆర్డీపీని వేగంగా సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ప్రాంతంలో పరిశీలించిన కమిషనర్

చేబ్రోలు హనుమయ్య కంపెనీ ప్రాంగణంలో శుక్రవారం జరిగే నారెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు పారిశుధ్య పనులను, రోడ్ల ప్యాచ్ వర్క్‌లను చేయాలని ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులను జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి సభ జరిగే హనుమయ్య కంపెనీ వరకు అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే మార్గంలో విధుల నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు.

అవినీతికి ఆస్కారమిస్తే చర్యలు తప్పవు

● నిరంతరాయ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

● ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ రవి

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్యాలయాల్లో అవినీతికి ఆస్కారమిస్తే బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలకు వెనుకాడేది లేదని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పటాన్‌శెట్టి రవి హెచ్చరించారు. గుంటూరు సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లోని స్కాడా సమావేశ మందిరంలో గురువారం సీఎండీ సమీక్షా సమావేశం నిర్వహించారు. విభజిత గుంటూరు సర్కిల్ పరిధిలోని గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌ల అధికారులతో ఆయన సమీక్షించారు. ముఖ్యంగా విద్యుత్ కార్యాలయాల్లో అవినీతి అనేది వినపడకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇక ప్రభుత్వ ప్రాధాన్యాలపై మరింత శ్రద్ధ చూపాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం చేయవద్దని, ప్రధానంగా సాంకేతిక లోపాలు లేకుండా చూడాలని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ఎప్పటికప్పుడు అందించాలని, ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. తద్వారా భవిష్యత్తులో విద్యుత్ సమస్య ఉండదన్నారు. రెవెన్యూ వసూళ్లను నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్ లింగమూర్తి, సీజీఎం సాంబశివరావు, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు, తెనాలి డివిజన్ ఆపరేషన్ ఈఈ చిరంజీవి, డిప్యూటీ ఈఈలు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం అడవి తక్కెళ్ళపాడు సబ్‌స్టేషన్ పక్కన ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును సీఎండీ రవి లాంఛనంగా ప్రారంభించారు.

రజక సంఘాల నాయకుల నిరసన

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రజకులను కించపరిచేలా హైదరాబాద్‌లో ఓ చర్చా కార్యక్రమంలో రచయిత చిట్టిబాబు చేసిన వ్యాఖ్యలపై ఆయన్ను వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రజక సంఘాలు, ఎస్సీ, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రచయిత చిట్టిబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం సాయంత్రం లాడ్జి సెంటర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట చిట్టిబాబు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం నేషనల్ దోబీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన చిట్టిబాబును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు మాట్లాడారు.

చీటింగ్ కేసులో చర్యలేవి?

● రూ.2.5 కోట్ల మోసంపై కేసు నమోదుతో సరి

● పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థలం విక్రయిస్తానంటూ రూ.2.5 కోట్లు తీసుకుని మోసం చేసిన ముఠాపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. గతంలో విక్రయించిన స్థలాన్ని చూపి దానిని విక్రయిస్తానని మోసం చేసిన ముఠాపై పట్టాభిపురం పోలీసులు గత నెల 20న కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేశారే కానీ నిందితులపై చర్యలు తీసుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. చేబ్రోలుకు చెందిన గట్టుపల్లి సుబ్రహ్మణ్యం అనే బ్రోకర్ దేవాపురంలోని ఈఎస్ఐ ఆస్పత్రి ఎదురుగా ఉన్న 10 సెంట్ల స్థలాన్ని తక్కువ ధరకు ఇస్తానని చెప్పి కృష్ణనగర్‌లో ఉంటున్న నంద్యాల రాజేశ్వరి, చదలవాడ రేణుక, నరసరావుపేటలోని లింగంగుంట్ల కాలనీకి చెందిన నంద్యాల శశిధర్‌రెడ్డిల నుంచి విడతల వారీగా 2023 మే నుంచి 2023 డిసెంబరు మధ్య రూ.2.5 కోట్లు తీసుకుని మోసం చేశాడు. ఆ స్థలానికి దారికి సంబంధించిన చిన్న వివాదం ఉందని, దానిని పరిష్కరించి రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి కాలయాపన చేస్తున్నాడు. అంతేగాక సుబ్రహ్మణ్యం తనకు దగ్గరి బంధువైన చేబ్రోలుకు చెందిన గట్టుపల్లి వాసుదేవరావు భార్య పద్మావతికి చేబ్రోలులో 94 సెంట్ల భూమి ఉందని, అది రూ.15 లక్షల ఉంటుందని ఆ భూమిని రేణుక భర్త పేరు మీద రిజిస్టర్ చేయిస్తానని నమ్మించి రేణుక దగ్గర రు.15 లక్షలు అప్పుగా తీసుకొని 2023 నవంబరు 21న సుధాకర్ పేరిట పద్మావతితో విక్రయ స్వాధీనపు అగ్రిమెంట్ రాసిచ్చాడు. అయితే ఈ స్థలం గట్టుపల్లి వాసుదేవరావు జనచైతన్య హౌసింగ్ వారికి 2007 లోనే అమ్మినట్లుగా తెలిసింది. మోసం చేశారని గ్రహించి విషయం గురించి అడగ్గా సమాధానం చెప్పకపోగా చంపుతామని బెదిరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారే కానీ చర్యలు తీసుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు.

తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

● భాష్యం చైర్మన్ రామకృష్ణ



భాష్యం స్కూల్ ఆవరణలో భోగి మంటలు వేసి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు(విద్య),జనవరి 9 (ఆంధ్ర జ్యోతి): తెలుగు సంస్కృతీ సంప్రదాయా లకు ప్రతీక సంక్రాంతి పండుగ అని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులకు మన కట్టుబొట్టు నేర్పించడం ద్వారా మన తెలుగు సంప్రదాయాలపై వారికి ఉన్నత మైన అభిప్రాయాలు ఏర్పడతాయన్నారు. ఇందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లి దండ్రులు కూడా కృషి చేయాలన్నారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో రామకృష్ణ పాల్గొని విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, భాష్యం బ్లూమ్స్, టాడ్లర్స్ బ్రాంచ్‌లలో కూడా సంక్రాంతి వేడుకలు నిర్వ హించారు. చిన్నారు లకు ఉపాధ్యాయులు భోగిపళ్ల పోశారు. భోగి మంటలు వేశారు. అందమైన రంగ వల్లుల అలంకరణ ఆహూతులను అలరించింది.

మాతృభాషతోనే ధారణాశక్తి సాధ్యం

● పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్



మాట్లాడుతున్న డాక్టర్ మేడసాని మోహన్

గుంటూరు(విద్య),జనవరి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మాతృభాష ద్వారానే ధారణాశక్తి పెంపు సాధ్యమవుతుందని పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్య క్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను మనసా, వాచా, కర్మణా గ్రహించాలన్నారు. విద్యార్థు లందరూ చదువుల సారాంశాన్ని గ్రహించాలని, చదివేకొద్దీ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. జ్ఞానంతో సమానమైన ఐశ్వ ర్యం లేదన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ పాల్గొన్నారు.

ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పాఠశాల డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, ప్రియాంక, పాల్గొన్న లెఫ్టినెంట్ కేజీ కృష్ణ

గుంటూరు(తూర్పు), జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మూడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లెఫ్టినెంట్ కేజీ కృష్ణ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యా ర్థులు విద్యా రంగంలో అద్భుతమైన మైలురాళ్లను అధిగమిస్తున్నారని, ముఖ్యంగా సాంస్కృతిక, క్రీడా రంగాలలోనూ తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలు,వినోదాత్మక నృత్యగీతాలు అలరించాయి. పాఠశాల నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ చుక్కపల్లి రమేష్, ట్రస్టీ చుక్కపల్లి సురేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నేటి నుంచి సంక్రాంతి సెలవులు

గుంటూరు(విద్య),జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ విషయాన్ని డీఈవో సీవీ రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషనరీ పాఠశాలలకు ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సెలవులు ప్రకటించారు.

ఉద్యోగుల జాయినింగ్ కాలమ్‌పై అవగాహన

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయినింగ్ (జాయినింగ్ టైం) గురించి రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో వివరించారు. నివాసం మార్చాల్సిన అవసరం లేని బదిలీ సందర్భంలో ఒక్క రోజు జాయినింగ్ కాలమును వాడుకోవచ్చన్నారు. ఈ నిబంధన కింద సెలవు రోజుగాని లేక ఆదివారం గానీ ఒక్క రోజుగా లెక్కించడం జరుగుతుందన్నారు. ఆఫీసు మార్పు లేకుండా పదవిలో మార్పు జరిగిన జాయినింగ్ కాలము తరువాత సెలవులు వచ్చిన ఆ మేరకు సాధారణ జాయినింగ్ కాలము పొడిగించినట్లుగా భావించబడుతుందన్నారు. స్థలం మార్పు ఉన్న సందర్భంలో 30 దినాల గరిష్ఠ పరిమితికి లోబడి జాయినింగ్ కాలం అనుమతించబడుతుందన్నారు.

వివాలో వైభవంగా సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజా, పక్కన వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలుగుదనం ఉట్టిపడేలా గ్రామీణ నేపథ్యం ప్రతిబింబించేలా వివా ది స్కూల్‌లో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గడ్డివాములు, ధాన్యపు బస్తాలతో వివా పాఠశాల ప్రాంగణం సంక్రాంతి శోభ సంతరించుకుంది. వివా వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అరుణప్రియ దంపతులు భోగి మంటలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి ఆల పాటి రాజేంద్రప్రసాద్, చిన్నారులను భోగి పండ్లతో ఆశీర్వదించారు. సంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు అలరించారు. పల్లె సంబరాలలో భాగమైన గోపూజ, పొంగళ్ళు, పతంగులు, ఊయలలు, జోడెద్దులబండి, కోడి పందాలతో సందడి చేశారు. సంక్రాంతి ప్రాముఖ్యత గురించి తెలియపరుస్తూ విద్యా ర్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హరిదాసు కీర్తనలు, సోదెమ్మ, బసవన్న, పిట్టలదొర వేష ధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, గీతాలాపనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతుల కష్టానికి ఫలితం వచ్చే పండుగ సంక్రాంతి అని అన్నారు. సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎల్ టి.కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, వివా, గుంటూరు క్యాంపస్ హెడ్ మమిళ్లపల్లి వేదవాణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



శ్రీపూజితలో నిర్వహిస్తున్న సంక్రాంతి వేడుకలు

గుంటూరు(విద్య),జనవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని శ్రీ పూజిత స్కూల్‌లో గురు వారం రాత్రి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ తెలుగు లోగిళ్ళలో జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి అని, సంస్కృతీ సంప్రదాయాలకు ఇది దిక్సూచిలా ఉంటుందన్నారు. భోగిపళ్ల, గొబ్బిళ్ళు, కోలాటం, హరిదాసుకీర్తనలు, గంగిరెద్దులు ఆటలతో వేడుకలు నిర్వహించారు.

సుమేధాలో..



సుమేధాలో చిన్నారులకు భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు,డైరెక్టర్ చంద్రశేఖరెడ్డి తదితరులు

స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధా స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో ప్రాంగ ణాన్ని అలకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్ర శేఖరరెడ్డి మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలు విద్యార్థులకు తెలియజేయాలనే లక్ష్యంతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జన రంజక కవి ప్రతిభా పురస్కారాల ఫలితాల ప్రకటన

గుంటూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం 11వ సంవత్సరం నిర్వహిస్తున్న 2024 జన రంజక కవి ప్రతిభా పురస్కారాల ఫలితాలు ప్రకటించారు. ఈ పోటీకి 75 పద్యవచన కవిత, గేయ, లఘు కవిత, బాల గేయాల సంపుటాలు అందాయని, అందులో నాలుగు పుస్తకాలను ఎంపిక చేసినట్లు వివరించారు. 2025 ఫిబ్రవరి 7న సాయంత్రం 6 గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై జరిగే సభలో ప్రముఖుల సమక్షంలో ఒక్కొక్క కవికి రూ. రెండు వేల రూపాయలు, జ్ఞాపిక, శాలువాతో సత్కారం జరుగుతుందని తెలిపారు.

ఇంటర్.. ఇంటర్నల్‌గానే

- సీబీఎస్ఈకి అనుగుణంగా మార్పులు
- కళాశాల స్థాయిలోనే ప్రథమ సంవత్సర పరీక్షలు
- ద్వితీయ సంవత్సర పరీక్షలు బోర్డు నిర్వహించేలా సన్నాహాలు
- జాతీయ స్థాయి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళిక
- ఇంటర్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వ నూతన సంస్కరణలపై భిన్నాభిప్రాయాలు



ఇంటర్ బోర్డు కార్యాలయం

గుంటూరు(విద్య), నరసరావుపేట టౌన్, బాపట్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షలు.. పరీక్షలు.. మార్కులు.. ర్యాంకులు.. విద్యార్థులపై ఒత్తిడి. ఇదీ నేటి విద్యా విధానం. ప్రధానంగా ఇంటర్ మీడియట్‌లో పరీక్షలు, మార్కులు, ర్యాంకుల ఒత్తిడి విద్యార్థులపై తీవ్రస్థాయిలో ఉంది. ఈ ఒత్తిడితో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా దేశంలోని ఇతర రాష్ట్రాల బోర్డులు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్ని నిర్వహించడం లేదు. ఈ క్రమంలో ఏపీలోని ఇంటర్ విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్పులకు సిద్ధమైంది. సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని పలువురు విద్యావేత్తలు భావిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలను ఇంటర్నల్‌గా నిర్వహించా లని ప్రభుత్వం సూచిస్తోంది. ఇందుకు అనుగుణంగా వచ్చే ఏడాది నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇంటర్ విద్యాసంస్థల్ని సన్నద్ధం చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు 30, అన్‌ఎయిడెడ్ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు 100పైగా ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 45 వేల మంది, ద్వితీయ సంవత్సరం 43 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు సమాచారం. ఇంటర్ మొదటి సంవత్సరంలో 2025- 26 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశ పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పాఠశాల స్థాయిలో ఇప్పటికే మార్పులు

పాఠశాల విద్యా శాఖ 2024-25 విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలను ప్రవేశపెట్టింది. తదనుగుణంగా 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో కూడా ఎన్‌సీఆర్‌టీ పాఠ్య పుస్తకాలను తీసుకురావాల్సి ఉంది. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ సిలబస్‌కు అనుగుణంగా ఈ మార్పులు జరగనున్నాయి. దేశ వ్యాప్తంగా అమల్లో ఉన్న మూల్యాంకనాన్ని పరిగణనలోకి తీసుకుని ఏపీలో కూడా ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్ని బోర్డు నిర్ణయించిన సిలబస్, బ్లూ ప్రింట్ ఆధారంగా కళాశాలల్లో ఇంటర్నల్‌గా నిర్వహిస్తారు. ద్వితీయ సంవత్సరం పరీక్షల్ని మాత్రం ప్రస్తుత విధానంలో బోర్డు నిర్వహించి ఫలితాలను విడుదల చేస్తుంది.

అందరితో చర్చించాలి..



ఇంటర్‌లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశ పెట్టి పరీక్షా విధానం, సిలబస్‌లో మార్పులపై మేధావులు, విద్యావేత్తలు, సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి. సిలబస్ సీబీఎస్ఈకి మారినా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం నిర్వహించాలి. పోటీ పరీక్షలకు అనుకూలంగా ప్రస్తుతం ఇంటర్‌లో గణితం సిలబస్ ఉంది. దీనిలో మార్పులపై ఒకసారి పునరాలోచించాలి.

- కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

ప్రస్తుత విధానమే బేష్..



ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని మార్చాల్సిన అవసరం లేదు. ఇంటర్నల్ మూల్యాంకనాన్ని వ్యతిరేకించలేం. లాభాల లక్ష్యంతో నడుస్తున్న విద్యాసంస్థలు ఇం టర్నల్స్‌లో విద్యార్థి ఏం రాసినా పూర్తి మార్కులు వేస్తున్నాయి. పబ్లిక్ పరీక్షలపై ఆధారపడి మార్కులు ఇవ్వడంలో విద్యార్థిపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. మన విధానం బాగున్నపుడు సీబీఎస్ఈని అనుసరించాల్సిన అవసరం లేదు. ఇంటర్ విద్య మాతృభాషలో ఉండాలి. విద్యార్థిపై ఒత్తిడి ర్యాంకుల పరుగులో వస్తోంది తప్ప సబ్జెక్టు భారం వల్ల కాదు. ఆరు సబ్జెక్టుల్లో ఐదు పాస్ అయినా చాలు అన్నది అర్థరహితం.

- డీ రమేష్‌పట్నాయక్, ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్

సంస్కరణలతో నూతన ఒరవడి



వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలో తీసుకు రానున్న సంస్కరణలు నూతన ఒరవడిని సృష్టిస్తాయి. ఇప్పటి వరకు మూస పద్ధతిలో ఉన్న గణితం, సైన్స్, విజ్ఞాన, జీవశాస్త్రాలు కలిపి ఒకేతా టిమీదకు తీసుకు వచ్చి విద్యార్థి నైపుణ్యతను వెలికి తీసుకువచ్చే కార్యక్రమం జరగబో తున్నది. జాతీయ విద్యావిధానం, ఎన్‌సీఈఆర్‌టీ సిల బస్ విద్యార్థి అనేక రకాలైన అవకాశాలను అందిపుచ్చుకునే పరిస్థితి కల్పిస్తుంది. సైన్స్ విద్యార్థి కూడా సోషల్‌సైన్సెస్, కామర్స్, ఎక నామిక్స్, సివిక్స్, చరిత్ర, **వ్యాపారశాస్త్రం, చార్టెడ్** అకౌంట్స్‌లో నిష్ణాతులయ్యే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ ఎం గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్, కేఆర్ జూనియర్ కళాశాల, నరసరావుపేట

ఆహ్వానించదగ్గ పరిణామం



ఐఐఎం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఇంటర్ విద్యలో చేస్తున్న సంస్కర ణలు ఆహ్వానించదగ్గ పరిణామం. ఇందులో విద్యార్థి రెండు రకాలైన గ్రూప్‌లు తీసుకునే అవకాశం ఉం టుంది కాబట్టి పోటీ ప్రపం చంలో విద్యార్థికి చాలా ఉపయోగపడే అవకాశం ఉంటుంది. అధ్యా పకులుగా ఆలోచిస్తే గణితం అధ్యాపకులకు అవకాశాలు దెబ్బతింటాయనే అనుమానం ఉంది. విద్యార్థుల పరంగా ఆలోచిస్తే ఇది చాలా ఆహ్వానించదగిన పరిణామం.

- డాక్టర్ ఎంఎస్ సుధీర్, ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎన్ కళాశాల, నరసరావుపేట

విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది



ఇంటర్ ద్వితీయ సంవత్సరంలోనే బోర్డు పరీక్షలు పెట్టాలనే ప్రతిపాదనలు విద్యార్థులపై ఒత్తిడిని తగ్గి స్తుంది. కాకపోతే విద్యార్థు ల సిలబస్ విషయంలో అందుకు తగ్గట్లు మార్పు లు చేయాలి. లేకపోతే వారిపై పరీక్షలు లేకపోయి నా అదనపు భారం విషయంలో అదే ఒత్తిడి ఉంటుంది. కానీ దీనికి సంబంధించిన మార్గద ర్శకాలలో స్పష్టత ఉండాలి. లేదంటే ఈ అవకాశాన్ని కొన్ని కళాశాలలు దుర్వినియోగం చేసే అవకాశం కూడా లేకపోలేదు.

-షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

సీరియస్‌నెస్ ఉండదు



ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఇంటర్ పరీక్షల సంస్కరణలు పేద విద్యార్థులకు నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ప్రతిభ పరంగా కొంచెం వెనకబడి ఉండే విద్యార్థులకు మొదటి సంవత్సరం పరీక్ష లేదనేసరికి సీరియస్‌నెస్ లోపిస్తోంది. కార్పొరేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు దీనివల్ల నష్టం పెద్దగా ఉండకపోవచ్చు. తమిళనాడులో ఇంటర్‌లో ఫస్ట్ క్లాస్ వచ్చినవాళ్లకే ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్టులకు అనుమతి అనేది వారి నిబంధన. కానీ ప్రభుత్వం ఈ విధానం తీసుకొస్తే అక్కడ అడ్మిషన్లను మన విద్యార్థులు కోల్పోతారు. సంస్కరణలు తేవాల్సిందే కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను విస్మరించకూడదు

-ఎం.వెంకటేశ్వర్లు(ఎం.వీ), శ్రీగౌతమి విద్యాసంస్థల ఎండీ, చీరాల

నేడు నృసింహుని ఉత్తర ద్వార దర్శనం

- దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థప్రసాదాలు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



నృసింహాలయంలో ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

మంగళగిరి సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం జరుగనున్న ముక్కోటి ఉత్సవాలకు అధికారగణం అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. గురువారం రాత్రి స్వామి వారిని జగన్మోహినిగా అలంకరించడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం వేకువజామున మూడున్నర గంటల ప్రాంతం లో శ్రీస్వామివారు, అమ్మవార్ల ఉత్సవరులను బంగారు గరుడ వాహనంపై ఉత్తర ద్వారంలోకి తీసుకువచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. అయితే బంగారు దక్షిణావృత శంఖు తీర్థాన్ని మాత్రం ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ ముఖమండపంలోనే ఇస్తారు. ఇందుకోసం భక్తులు విధిగా ఆలయంలోనికి వెళ్లి మూల విరాట్‌ను దర్శించుకుని శంఖుతీర్థాన్ని స్వీకరించాల్సి ఉంటుంది. ఈ కారణంగా ఆలయంలోనికి వెళ్లేందుకు నాలుగు ప్రధాన క్యూలైన్లను ఏర్పాటుచేశారు. ఆలయానికి ఉత్తరంగా వున్న కల్యాణోత్సవ గ్రౌండు నుంచి ఉచిత క్యూలైన్‌తో పాటు దక్షిణం వైపు నుంచి తూర్పు రాజగోపురం గుండా రూ. వంద, రూ.200 టిక్కెట్లు, ప్రోటోకాల్ దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు నిర్మించారు. ఉత్తర ద్వారం వద్ద సాధారణ ఉచిత క్యూలైన్‌తో పాటు రూ.వంద, శీఘ్రదర్శనం(రూ.200) క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బంగారు దక్షిణావృత శంఖుతీర్థాన్ని శుక్రవారం వేకువజాము మూడున్నర గంటల నుంచి రాత్రి ఆలయ ద్వార బంధనం చేసే వేళ వరకు అంటే రాత్రి పది గంటల వరకు ఇవ్వనున్నట్లు ఆలయ కార్యనిర్వహణా ధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలియజేశారు. శంఖుతీర్థం కోసం దూరప్రాంతాల నుంచి కూడ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నందున భక్తుల సౌకర్యార్థం శంఖుతీర్థ ప్రసాద సమయాన్ని పెంచడంతోపాటు మర్నాడు శనివారం కూడా శంఖుతీర్థ ప్రసాదాలను అందజేయనున్నట్లు ఆయన వివరించారు. ఉత్సవాల సందర్భంగా ఉత్తర గాలిగోపురంతోపాటు ఎగువ, దిగువ సన్నిధులను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ముక్కోటి ఉత్సవ ఏర్పాట్లు పూర్తి: ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్

మంగళగిరిలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. దిగువ సన్నిధిలో గురువారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ముక్కోటి ఉత్సవాలపై మంత్రి నారా లోకేశ్ సమీక్షించి పలు సూచనలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డీసీ, ముక్కోటి ఉత్సవాల ఇన్‌చార్జి లీలాకుమార్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, ప్రధాన అర్చకుడు మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు పాల్గొన్నారు. నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ మురళీ కృష్ణ ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్య వేక్షించారు. అర్బ న్ సీఐ డి.వినోద్‌కుమార్ సిబ్బందికి విధులను కేటాయించారు

అమరావతిలో..

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాలలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివార్ల ఉత్తరద్వార దర్శనం శుక్రవారం ఉదయం ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా అమరావతి లోని అమరేశ్వరాలయం, వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు కోదండరామాలయం, పాండురంగ స్వామి ఆలయం, గీతామందిరంలో ఉదయం 5గంటల నుంచి స్వామివార్ల ఉత్తరద్వార దర్శనం భక్తులకు కల్పించనున్నారు. ముందుగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు ఉత్సవమూర్తులను ఉత్తరద్వారంలో ప్రత్యేక మండపంపై ఏర్పా టు చేయనున్నారు. ఉదయం పది గంటలకు పురవీధు లలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించ నున్నారు.



ప్రత్యేక అలంకరణలో నృసింహుడు



పోలీసు సిబ్బందికి విధులు కేటాయిస్తున్న సీఐ వినోద్‌కుమార్



శాస్త్రీయ నృత్యం చేస్తున్న చిన్నారులు

నకిలీ పాస్ పుస్తకాలతో రూ.5కోట్లు స్వాహా

(3వ పేజీ తరువాయి)

పాటిమీదిబజారుకు చెందిన సుంకర వెంకటేశ్వర్లు, తురుమెళ్ల వెంకటసందీప్‌కుమార్ అలియాస్ సందీప్, హనుమాన్‌నగర్ ఐదో లైనుకు చెందిన బత్తుల లక్ష్మీనారాయణ, నడిగడ్డ గ్రామానికి చెందిన నెమలిపురి శ్రీనివాసరావు, నూజెండ్ల మండలం మొలకలూరు గ్రామానికి చెందిన మానం నాగేశ్వరరావు, గుంటూరు ఆర్టీసీకాలనీ ఒకటో లైన్‌కి చెందిన ఆవుల తిరుపతిరెడ్డి అలియాస్ నానిరెడ్డి, ప్రస్తుతం నరసరావుపేటలో ఉంటున్న నాటి మాచవరం విశ్రాంత తహసీల్దారు గడినపూడి లెవిలను అరెస్టు చేశారు. నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి ఎస్పీ సతీష్‌కుమార్ వివరాలు తెలిపారు. నకిలీ పాస్ పుస్తకాలతో సొసైటీల్లో రుణాలు తీసుకునేందుకు ఈ ముఠా ప్రణాళిక రూపొందించి అమలు చేసింది. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటిస్తే ఆయా రుణాలు చెల్లించే పని ఉండదని, బ్యాంకులు కూడా పట్టించుకోవని ఈ ముఠా రెండు రకాలైన నేరాలకు పాల్పడిందని ఎస్పీ తెలిపారు. నమోదైన కేసులో సుమారు 30 మంది నిందితులు కలిసి నకిలీ రైతులను ఎంపిక చేసుకుని బ్యాంకులో వారి పేరు మీద రుణాలు తీసుకున్నారని తేలిందని, అయితే వీరిలో 11 మంది నిందితులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి కథనాల ఆధారంగా..

ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పశ్చిమ వీరాయపాలెం గ్రామానికి చెందిన ఉన్నగిరి లింగేశ్వరరావు పేరు మీద చిన్నకొండ్రుపాడు సొసైటీలో రూ.6 లక్షల రుణానికి సంబంధించి గత ఏడాది సెప్టెంబరు 18న ప్రతిపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. 2022 ఫిబ్రవరి 23, 24 తేదీల్లో 'ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్లో జీడీసీసీలో నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు పెట్టి రూ.5 కోట్ల స్వాహా' అనే శీర్షికన వరుసగా వార్తా కథనాలు వెలువడగా వాటిని ఆధారంగా చేసుకుని సీఐ శ్రీనివాసరావు ఈ కేసును దర్యాప్తు చేశారు. నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలు, 1బీ, అడంగల్, ఆధార్, పాన్ కార్డులతో వెబ్ లాండ్ ఎక్కించి రుణాలు తీసుకున్న తర్వాత ఆ వివరాలను వెబ్‌సైట్ నుంచి తొలగించేవారని తమ విచారణలో తేలినట్లు ఎస్పీ తెలిపారు. సీతారామాంజనేయులునకిలీ పాస్ పుస్తకాలను తయారు చేస్తుండగా, ఆవుల తిరుపతిరెడ్డి ఆధార్ కార్డులో అడ్రస్‌లను మార్చి పాన్ కార్డులను తయారు చేసేవాడన్నారు. నకిలీ రైతులను తిరువీధుల. యోగయ్య, తురుమెల్ల వెంకటసందీప్‌లు సమకూర్చగా వీరికి బొల్లినేడి. రవికుమార్, అప్పటి జీడీసీసీ ప్రత్తిపాడు బ్రాంచ్ మేనేజర్, అప్పటి మాచవరం తహసీల్దారు లేవీ సహకరించేవారన్నారు. కర్రి రవిచంద్రబాబు, ఉన్నగిరి లింగేశ్వరరావు, పండిత నాగరాజు, బత్తిపళంకి వీరయ్య, సరిపల్లి అప్పరాజు, నారు వెంకటరెడ్డిలను నకిలీ రైతులుగా చూపించి రుణాలు తీసుకున్నారు. 54 రుణాల మంజూరు సంబంధించి సుమారు రూ.5 కోట్ల కుంభకోణం జరిగినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు అనంతరం మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేస్తామన్నారు. 11 మందిని అరెస్టు చేసిన సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, ప్రతిపాడు సీఐ శ్రీనివాసరావు, పెదనందిపాడు, కాకుమాను ఎస్ఐలు మధుపవన్, ఏకనాథ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో సౌత్ డిఎస్పీ మల్లికార్జునరావు, ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు

రుణాల.. మాఫీయా

(3వ పేజీ తరువాయి)

వీరంతా కలిసి బ్యాంకు సొమ్మును పక్కదారి పట్టించారని విచారణలో వెలుగుచూసింది. నకిలీ సభ్యుల పేర్లపై ఆస్తుల బది లీ ప్రక్రియకు వీరు సహకరించినట్లు అధికారుల విచారణలో వెలు గుచూసింది. పల్నాడు ప్రాంతంలో ఇలాంటివి ఎక్కువగా జరిగి నట్లు గుర్తించారు. రుణాలు పొందేందుకు నకిలీ ఈసీలు సృష్టించా రని పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చారు. మార్టిగేజ్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు సబ్ రిజిస్ట్రార్ విచారణలో తేలింది. పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన కొందరు నేతలు జీడీసీసీని అడ్డగోలుగా కొల్లగొట్టినట్లు అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. నల్లపాడు బ్రాంచ్‌లో రూ.70 కోట్ల వరకు రుణాలు మంజూరు కాగా అందులో రూ.53 కోట్లు ఒకే ఒక్క కోల్డ్‌స్టోరేజ్‌కి ప్లెడ్జ్ రుణాలు కింద మంజూరు చేశారంటే ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు. నల్లపాడు బ్రాంచ్ అక్రమాలపై విచారణ జరుగుతుండగా గతంలోనే సహకారశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నల్లపాడు బ్రాంచ్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని కూడా త్వరలోనే అరెస్టుచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

2022లోనే వెలుగుచూసిన అక్రమాలు

జీడీసీసీలో జరిగిన అక్రమాలపై సహకార కమిషనర్‌కు 2022 అక్టోబరు 6న జిల్లా సహకార అధికారి వీరాచారి నివేదిక అందజేశారు. బినామీ పేర్లతో కొట్టేసిన సొమ్మును వాటాలు వేసుకుని పంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తం సొమ్ములో అగ్రభాగం అప్పటి నేతల జేబుల్లోకి వెళ్లగా, మిగిలిన మొత్తంలో స్థాయిని బట్టి పంపకాలు జరిగిందని సమాచారం. ఈ క్రమంలో అప్పటి జేసీ విచారణ జరిపించాలని ప్రభుత్వానికి లేఖ రాస్తూ సీబీడీ విచారణ జరిపించాలని కూడా పేర్కొన్నారు. అయితే నాటి ప్రభుత్వ పెద్దలు ఆ లేఖను కూడా తుంగలో తొక్కేలా బ్యాంకు అధికారులు, సిబ్బంది పావులు కదిపారు. ఎన్ని అక్రమాలకు పాల్పడితే అంత పెద్ద పోస్టులో కూర్చోపెట్టి వారితో మరిన్ని తప్పుడు పనులు చేయించారు. గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లో ప్రస్తుతం అత్యంత కీలకమైన స్థానంలో ఉన్న చాలామంది అధికారులు కేసుల్లో ఉన్నవారే కావటం గమనార్హం. పైగా అప్పట్లో అక్రమార్కులను వదిలి పెట్టి ఆ అక్రమాలను వెలుగులోకి తెచ్చిన అధికారులను అప్పట్లో కొందరు వైసీపీ ముఖ్య నేతలు ఇబ్బందులు పెట్టారు. ఆ తర్వాత కూడా నల్లపాడు, రెడ్డిపాలెం, పల్నాడు జిల్లాలోని పలు బ్రాంచిల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. గత ప్రభుత్వంలో సీనియర్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర జీడీసీసీ అక్రమాలపై విచారణ జరిపించాలని పోరాటం కూడా చేశారు.

వసూలు కానీ మొండి బకాయిలు అన్నీ అవేనా?

జీడీసీసీ బ్యాంకుకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు రూ.425 కోట్ల వరకు వసూలు కానీ మొండిబకాయిలు ఉన్నట్లు ఆడిట్ నివేదికలు చెబుతున్నాయి. ఇవన్నీ నేతల జేబుల్లోకి వెళ్లినవే అని సహకార శాఖ అభియోగం. అసలు రుణాలు పొందిన వ్యక్తులు ఎవరో కూడా అధికారులకి తెలియదు. ఇటువంటి వాటిపై లోతైన విచారణ జరిగితే భోక్తలు వెలుగులోకి రారు.

మాజీ మంత్రి అంబటి సోదరులపై అట్రాసిటీ కేసు

- నిందితులను అరెస్టు చేయకపోతే దీక్ష : పిల్లి బాబూరావు

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సోదరుడు మురళీకృష్ణలతో పాటు భజరంగ్ జూట్‌మిల్ నిర్వాహకులు, టీడీపీ నేతలు కోవెలమూడి రవీంద్ర, గుంటుపల్లి శేషగిరిరావు తదితరులపై జైభీమ్ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిల్లి బాబూరావు ఫిర్యాదు మేరకు నగరంపాలెం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి బాబూరావు తెలిపిన వివరాలు.. భజరంగ జూట్ మిల్‌లో లాభాలు, ఆస్తులు, కార్మికుల కాలనీ స్థలంపై 2009లో డైరెక్టర్ దావ్‌గోపాల్ లునాని అంబటి రాంబాబుకి జరిగిన అక్రమ సేల్ డీడ్‌ను రద్దు చేయాలని 2022లో హైకోర్టులో కేసు వేశారు. అంబటి సోదరులకు సహకరిస్తూ కోర్టులో వేసిన కేసు వెనక్కి తీసుకోవాలని 2023లో కోవెలమూడి రవీంద్ర, టీఎన్‌టీయూసీ నేత గుంటుపల్లి శేషగిరిరావులు తనను బెదిరించారు. సార్వత్రిక ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో ఉండగా అంబటి బ్రదర్స్ బెదిరించారు. అయితే అప్పట్లో వైసీపీ పాలకులకు భయపడి కేసు పెట్టలేదు. ప్రభుత్వం మారిన తర్వాత ఎస్పీకి ఫిర్యాదుచేయగా తిరస్కరించి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకోమని చెప్పారు. దీంతో గత నవంబరు 15న హైకోర్టులో పిటిషన్ వేయగా వారిపై కేసు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయినా 53 రోజుల వరకు నిందితులపై ఎఫ్ఐఆర్ చేయలేదు. ఇప్పటికైనా నిందితులను అరెస్టు చేసి కోర్టుకి హాజరు పరచకపోతే ఎస్పీ కార్యా లయం ఎదుట దీక్ష చేస్తానని పిల్లి బాబురావు ప్రకటనలో హెచ్చరించారు.

అవలీలగా.. అత్యున్నత ర్యాంకు

- సీఏ, సీఎంఏలో జాతీయ స్థాయిలో మొదటి స్థానం
- అకుంఠిత దీక్షతో కల సాకారం చేసుకున్న రిషబ్ ఓస్వాల్

గుంటూరు(విద్య), జనవరి 9(ఆంధ్రజ్యోతి): అమ్మో సీఏ, సీఎంఏనా.. ఆ కోర్సులు చాలా కష్టం.. ఉత్తీర్ణత సాధించలేం.. అని ఎందరో విద్యార్థులు వెనుకంజ వేస్తారు. అకౌంటెన్సీపై ఇష్టంతో కోర్సులో చేరినా ఆ తర్వాత వెనుకంజ వేస్తారు. అందరూ కష్టమని భావించే ఈ కోర్సుల్లో అవలీలగా జాతీయ స్థాయిలో అత్యున్నత ర్యాంకులతో రిషబ్ ఓస్వాల్ అకౌంట్స్ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. అకుంఠిత దీక్ష.. ఆత్మవిశ్వాసం.. పట్టుదల.. ప్రణాళికతో తన కలని రిషబ్ సాకారం చేసుకున్నాడు. కోర్సు పూర్తి చేయడం మాత్రమే కాక రెండు పదుల వయసులోనే జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి మాస్టర్‌మైండ్స్ విద్యార్థి రిషబ్‌ఓస్వాల్ నేటి యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచాడు.రాజస్థాన్‌కు చెందిన రిషబ్ తల్లిదండ్రులు సుమిత్రి, రాజేష్‌కుమార్‌ఓస్వాల్‌లు బతుకుదెరువు కోసం చిత్తూరు జిల్లా పలమనేరుకు వచ్చి ఫైనాన్స్ వ్యాపారం చేస్తూ స్థిరపడ్డారు. రిషబ్ 2018లో పలమనేరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో ఐసీఎస్ఈ సిలబస్‌తో పది పరీక్షలు రాసి 97.5 శాతం మార్కులతో పాసయ్యాడు. అనంతరం సీఏ కోర్సు కోసం గుంటూరులోని మాస్టర్‌మైండ్స్‌లో చేరాడు. తొలుత 2020లో 96.8 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేశాడు, అనంతరం 2021లో సీఏ ఇంటర్ పరీక్షలు రాసి జాతీయ స్థాయిలో ఎనిమిదో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తర్వాత ఓ సంస్థలో ఆర్టికల్‌షిప్ పూర్తి చేస్తూనే సీఏ ఫైనల్ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు.దీంతో ఇటీవల ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ(చార్టెర్డ్ అంకౌంటెంట్) ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించాడు. ఇదిలా ఉంటే రిషబ్ సీఎంఏ(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) కోర్సుపై దృష్టి పెట్టి అందులో ఫౌండేషన్, ఇంటర్ స్థాయిలో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు.

రోజుకు 15 గంటలు చదివా

సీఏ ఫైనల్ పరీక్షలకు ఒక ప్రణాళిక ప్రకారం సిద్ధమయ్యాను. తొలుత సిలబస్‌ను రోజుకు 8 గంటల్లో విభజించుకుని చదివాను. తర్వాత రోజుకు పది గంటలు, ఆ తర్వాత 15 గంటల పెంచి చదివి.. పరీక్షలకు సిద్ధమయ్యాను. తీవ్ర మానసిక ఒత్తిడికి గురి కాగా సోదరి యుక్తా సూచనతో యోగా, ధ్యానంతో పాటు ఇష్టమైన సంగీతం విన్నాను. తల్లిదండ్రులు ప్రోత్సాహం, మాస్టర్‌మైండ్స్ అధ్యాపకులు ఇచ్చిన ప్రణాళిక ర్యాంకు సాధనకు ఎంతో ఉపయోగపడింది.

- రిషబ్ ఓస్వాల్



రిషబ్‌ను సత్కరిస్తున్న మట్టుపల్లి మోహన్

సమావేశానికి గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు (విద్య) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఏడో తేదీన పరీక్షా భవన్‌లో జరిగిన భారత్ సౌత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సమావేశానికి గైర్హాజరైన ప్రధాన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డిఇవో సివి రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సిరిపురం. నల్లపాడ, ముట్లూరు, నూతక్కి, పెనుమాక, అంగలకుదురు, యర్రపాలెం ఎంపీయూపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గైర్ హాజరయ్యారని తెలిపారు. భారత్ స్కౌట్స్ అండ్ గ్రేడ్స్ నిర్వహణ అయా ఉపాధ్యాయులకు నిధులు వారి ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు అయినప్పటికీ సమావేశానికి వారు హాజరుకాలేదని వివరించారు సమావేశానికి హాజరు కాకపోవడానికి గల కారణాలు తెలియజేస్తూ వివరణ ఇవ్వాలని షోకాజ్‌లు జారీ చేసినట్లు డీఈవో రేణుక తెలిపారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

నేడు తహసీల్దారు కార్యాలయంలో అర్జీల అందజేత

మంగళగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంత పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రజలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ప్రజలతో అర్జీలు అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తెలిపారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నిరుపయోగమైన స్థలాలను కేటాయించి పేదలను మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు

వట్టిచెరుకూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో శుక్రవారం తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశి ఉత్తర ద్వారదర్శనానికి ఆలయాలు సర్వం సిద్ధం చేశారు. ప్రధానంగా వట్టిచెరుకూరు, అనంతవరప్పాడుతో పాటు తదితర గ్రామాల్లోని వైష్ణవాలయాలు, ముట్లూరులోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

నేడు మినీ గోకులాలు ప్రారంభం

తుళ్లూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మినీ గోకులాలను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కానూరి శిల్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 11 మినీ గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. పెదపరిమిలో ఆర్. కోటేశ్వరరావుకు (6 గేదెలు) రూ.2,30 లక్షల వ్యయంతో, వడ్డమానులో బెజ్జం శ్రీనివాసరావుకు (4 గేదెలు) రూ.1.85 లక్షల వ్యయంతో, బుర్రా శంకరరెడ్డికి (6 గేదెలు) రూ.2.30 లక్షల వ్యయంతో, అనంతవరంలో మేకల ఏసుదాసుకు (4 గేదెలు) రూ.1.85 లక్షల వ్యయంతో మినీ గోకులాలు నిర్మించినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని మినీ గోకులాలను ఉదయం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

పెదనందిపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల విద్యార్థులకు మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత ఉంటుందని సర్దార్ వల్లభాయ్‌పటేల్ పోలీసు అకాడమీ యోగా శిక్షకుడు కనపర్తి నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరిముల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు రోజులో ఒక గంట సమయాన్ని యోగాకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థి సంఘ నాయకుడు కొల్లా సీతారామయ్య, హెచ్‌ఎం లక్ష్మీదుర్గా తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

మంగళగిరి సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి తక్షణమే రాజీనామా చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్ సలీమ్ డిమాండ్ చేశారు. అమిత్‌షా రాజీనామా చేయాలని కోరుతూ మంగళగిరి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీర్మానం చేసి, ఆ ప్రతిని గురువారం అంబేద్కర్ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సుభానీ, దర్శనపు శామ్యూల్ పాల్గొన్నారు.

జగన్మోహినిగా అలరించిన నృసింహుడు


జగన్మోహిని అలంకారంలో శ్రీవారు

మంగళగిరి సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా మంగళాద్రి లక్ష్మీనృసింహ స్వామి గురువారం రాత్రి జగన్మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి దుగ్గిరాల మండలం పెదపాలెం వాస్తవ్యుడు వాసిరెడ్డి మల్లేశ్వరరావు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించారు. అనంతరం గురువారం అర్ధరాత్రి తర్వాత స్వామివారికి తిరువంజనోత్సవం ప్రారంభమైంది. దేవదాయ శాఖ సహాయ కమిషనరు, ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైల్లో 13 కిలోల బంగారం రవాణా

● గుంతకల్లులో 12 మంది అరెస్టు

కర్నూలు/తాడిపత్రి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కేరళలో ఎర్నాకుళం నుంచి కర్నూలు జిల్లా ఆదోనికి రైలులో తరలిస్తున్న 13 కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 12మందిని అరెస్టు చేశారు. వ్యాపార, వాణిజ్య రంగంలో రెండో ముంబయిగా పేరుగాంచిన ఆదోని బంగారం వ్యాపారానికీ ప్రసిద్ధి. మెజార్టీగా జీరో వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందులో భాగంగానే ఆదోనికి చెందిన 12మంది బంగారు వ్యాపారులు 13 కిలోల 24 క్యారెట్ల బంగారు బిస్కెట్లు(గోల్డ్ బార్) ఎర్నాకుళంలో కొనుగోలు చేశారు. కన్యాకుమారి-పూణే ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా ఆదోని వ్యాపారులు బంగారం రైలులో తీసుకెళ్తున్నారని సెంట్రల్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ అధికారులకు సమాచారం అందింది. ఆ శాఖ సూపరింటెండెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది ఆ రైలులో ప్రతి బోగీని క్షుణంగా తనిఖీ చేశారు. గురువారం అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో బంగారం అక్రమ రవాణా చేస్తున్న 12 మంది ఆదోని వ్యాపారులను పట్టుకొని వారి నుంచి దాదాపు 13 కిలోల బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. పట్టుబడిన బంగారం విలువ రూ.10 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. బంగారం, రవాణా చేస్తున్న వ్యాపారులను తాడిపత్రిలోని కస్టమ్స్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పోలీస్ బందోబస్తుతో బంగారం, వ్యాపారులను విజయవాడకు తరలించారు.

పాఠశాల ఖాతాలకే 'తల్లికి వందనం'

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
● ఉత్సాహంగా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు


రెయిన్‌బో పాఠశాలలో జరిగిన సంక్రాంతి సంబరాలలో భోగి మంటలు వేస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఏ పాఠశాలలో అయితే పిల్లలు చదువుతున్నారో ఆ పాఠశాల ఖాతాలకే 'తల్లికి వందనం' పథకం సొమ్ము ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక రెయిన్‌బో పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తల్లులకు ఇస్తామన్న సొమ్ముకు వెయ్యి తగ్గించి ఎగనామం పెట్టారని విమర్శించారు. కానీ, టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఈ సొమ్ము ఇస్తుందని, ఒకవేళ రూ.15 వేలు కన్నా తక్కువ ఫీజు ఉంటే మిగిలిన సొమ్ము తల్లిదండ్రులకు ఇస్తుందన్నారు. పాఠశాల ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. భోగి మంటలు వేసి, గంగిరెద్దుతో ఆటలు ఆడించి, చిన్నారుల వేసిన కోలాటాలను తిలకించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కుర్రి సుబ్బారెడ్డి, శివరామప్రసాద్ పాల్గొన్నారు.

● ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటే విధంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో ఎన్‌టీఆర్ విద్యా మిషన్ చైర్మన్ ఉప్పల రఘుబాబు, ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి పాల్గొన్నారు. విద్యార్థులు పాఠశాలలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రత్తిపాడు శ్రీనివాస స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలతో ప్రారంభించిన ఈ సంబరాలలో ముగ్గుల పోటీలు, గాలి పటాలు ఎగుర వేశారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు పాఠశాల డైరెక్టర్ బాపతు శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేయాలని, అలా కాకుండా తమ ఇష్టానుసారం వ్యవహరిస్తామంటే కుదరదని, తప్పు చేస్తే శిక్ష తప్పదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సచివాలయ సిబ్బందిని సున్నితంగా హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సచివాలయ సిబ్బంది, మండలాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులకు దిశా నిర్దేశం చేశారు. ఇప్పటి వరకూ సచివాలయ ఉద్యోగులు దారం లేని గాలి పటంలా ఉన్నారని, అలా కాకుండా ఈ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పింఛన్ల విషయంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడిన మాటలను ఆయన తప్పుబట్టారు. కొత్త సంవత్సరం నుంచి కొత్త పరిపాలనకు శ్రీకారం చుట్టాలన్నారు. పేదల వద్ద లంచాలు తీసుకోకుండా పనులు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పలుశాఖల ఉద్యోగుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణకుమార్, ఎంపీడీవో శివపార్వతి పాల్గొన్నారు.

గ్రామాల్లో సమన్వయంతోనే అభివృద్ధి

వట్టిచెరుకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగి స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవడం ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయనే విషయాన్ని గమనించాలని సచివాలయ అధికారులు, మండల స్థాయి అధికారులకు ఎమ్మెల్యే రామాంజనేయులు సూచించారు. మండలంలోని పుల్లడిగుంటలోని కల్యాణ మండపంలో గురువారం గ్రామ సచివాలయాల్లోని అధికారులు, సిబ్బంది మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సౌకర్యాలకు తగిన ప్రాధాన్యమివ్వాలని అన్నారు. ప్రభుత్వపరంగా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం ద్వారా ప్రభుత్వం ఆశించిన లక్ష్యాన్ని చేరుకో గలుగుతామన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్ బాబు, డీటీ దరియావలి, దేశం నాయకులు కొర్రపాటి నాగేశ్వర రావు, మండల టీడీపీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరరావు, మండల జనసేన అధ్యక్షుడు పత్తి భావన్నారాయణ పాల్గొన్నారు.

ముగ్గులు సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనం

● మాదిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి


కోలాటం ఆడుతున్న ఉండవల్లి శ్రీదేవి, డాక్టర్ అమల

తాడికొండ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముగ్గులు మన సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. స్థానిక సత్యసాయి హైస్కూల్లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీదేవి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పల్లె జీవనాన్ని ఉనికిని ప్రతిబింబిస్తుందన్నారు. సాంస్కృతిక అంశాలు, మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి, ఏకాగ్రతకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాయపాటి మోహన్ సాయికృష్ణ, సీఈవో అమల, డాక్టర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఉపాధ్యాయుడు ఎంపిక

పెదనందిపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీజీపాలెం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గవిని శ్రీనివాసరావు జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు గురువారం తెలిపారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపిక కావడంతో ఈ నెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి ప్రదర్శనలో విద్యుదయస్కాంతత్వ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని ఎంఈవో జాకబ్, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి


మాంటిస్సోరీ సీబీఎస్ స్కూల్లో సంబరాలు


కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో భోగిమంటలు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదనందిపాడు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి అన్నారు. స్థానిక లయన్స్ మాంటిస్సోరీ సీబీఎస్, అశోకా, నంది పాఠశాలల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాలకవర్గ సభ్యులు సంప్రదాయ దుస్తుల్లో భోగి మంటలు వేసి, పొంగళ్ళు పొంగించారు. చిన్నారులకు భోగిపళ్ళు పోశారు. విద్యార్థులు సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా ఎద్దుల బండి, ట్రాక్టర్లపై, హరిదాసులు, ఆయా వేషధారణలతో గ్రామంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పాలకవర్గ సభ్యులు దాసరి శేషగిరిరావు, ప్రిన్సిపాల్ కిరణ్‌జోష్, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● స్థానిక అశోకా పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో ముద్దన శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్ శివప్రసాద్, కోశాధికారి ఎలిశెట్టి రమణయ్య, అశోకా పాఠశాల డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, సభ్యులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాకుమాను, జనవరి 9(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలును సూచించేవే పండుగలని ఎంఈవో కేఎఫ్ కెన్నడీ అన్నారు. మండలపరిధిలోని కొండపాటూరు ఎంపీయూపీ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, కృష్ణుడు, గోపికల వేషధారణలు చూపరులను ఆకర్షించాయి.

రెవెన్యూ గ్రామసభలపై అవగాహన ర్యాలీ

దుగ్గిరాల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుకలపూడిలో రెవెన్యూ గ్రామసభలపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. రెండో విడత భూరీసర్వే కోసం పైలెట్ ప్రాజెక్టు కింద పేరుకలపూడిని ఎంపిక చేసినట్లు తహసీల్దార్ ఐ సునీత తెలిపారు. గ్రామంలో 120 రోజుల పాటు 366 సర్వే నెంబర్లలో 1420 ఎకరాల భూమిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్వేయర్లు, వీఆర్ఏ, వీఆర్‌వోలు, పాల్గొని రైతుల భూసమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం పనిచేస్తుందని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సారధి, ఆర్ఐ త్రివేణి, ఆర్ఎస్‌డీటీ, పలువురు వీఆర్‌ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.



గ్రామ రెవెన్యూసభలపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పుల్లడిగుంట అభివృద్ధికి తోడ్పాటునందించాలి


ఎమ్మెల్యే బూర్లను సన్మానిస్తున్న ఉప్పుటూరి చిన రాములు

వట్టిచెరుకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పుల్లడిగుంటలో మెరుగైన మౌలిక సదుపాయా లకు, గ్రామాభివృద్ధికి సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుకు పుల్లడిగుంటకి చెందిన ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ చైర్మన్ ఉప్పుటూరి చినరాములు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. తన కుమారుడు ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి సహకారంతో గ్రామంలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామని, రైతులకు వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందిస్తున్న విషయాన్ని వివరించారు.

టీడీపీలో చేరికలు

వట్టిచెరుకూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్నెపాడు గ్రామ పంచాయతీ వైసీపీ సర్పంచ్ బత్తుల మానస, ఆమె భర్త ఏసుబాబు, ఎస్సీ కాలనీకి చెందిన కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరాయి. మండలంలోని పుల్లడిగుంటలోని కల్యాణ మండపంలో ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడుతూ వైసీపీలో క్రియాశీలకంగా పని చేశామని, సర్పంచ్‌గా తన భార్య మానస ఎన్నికైనప్పటికీ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేక పోయా మని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న నేపథ్యంలో తమ కుటుంబంతో పాటు కాలనీకి చెందిన కుటుంబాలు టీడీపీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, అనంత వరప్పాడు సర్పంచ్, ఎస్సీ నాయకుడు దారా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

37వ రోజుకు చేరుకున్న ఏసీసీ కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారంతో 37వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను దుర్గ భవాని, ఎం శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు మాట్లాడుతూ ఇప్పటికే 171 మంది ఏసీసీ కార్మికులు అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందారని అన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించకుండా ఏ ప్రభుత్వమైనా నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు.

కౌంటర్ సైన్ ఉంటేనే సచివాలయ ఉద్యోగులకు జీతం

● ఎంపీడీవో ఉత్తర్వులు ● విధుల్లో అలక్ష్యమే ఇందుకు కారణం

ప్రత్తిపాడు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విధులలో అలసత్వం వహిస్తూ సమయపాలన పాటించకుండా, తమ ఇష్టానుసారం విధులకు హాజరవుతున్న సచివాలయ సిబ్బందిపై ప్రత్తిపాడు ఎంపీడీవో శివకుమారి ఆంక్షలు విధించారు. సచివాలయ సిబ్బందిని మొత్తాన్ని తన కంట్రోల్‌లోకి తీసుకోవడమే కాకుండా వారి విధులు, పనిచేసే విధానంతో పాటు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అన్ని శాఖల పని వత్తిడి లేకుండా విధులను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తూ సరిగా విధులకు హాజరు కాని పరిస్థితి ఉంది. అంతేగాకుండా, 'అక్కడ ఉన్నాం. ఇక్కడ ఉన్నాం' అంటూ కుంటి సాకులు చెబుతూ విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇక నుంచి కుంటి సాకులకు చెక్ పెట్టేందుకు ఆమె నడుం బిగించారు. అందులో భాగంగానే వారి జీతాల విషయంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. సచివాలయాల సిబ్బంది వారి అనుబంధ శాఖల నుంచి ప్రతి నెలా డ్యూటీ సర్టిఫికెట్ తీసుకోవాలని, ఆ డ్యూటీ సర్టిఫికెట్‌లో తన కౌంటర్ సైన్ ఉంటేనే జీత భత్యాలు చెల్లించాలని కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయాల సిబ్బందికి ఆయా పంచాయతీ కార్యదర్శులు డీడీవోలుగా వ్యవహరిస్తున్నారు. ఇక నుంచి ఎంపీడీవో కౌంటర్ సైన్ లేకుండా పంచాయతీ కార్యదర్శులు జీతం చెల్లిస్తే వారి జీతాన్ని నిలుపుదల చేస్తానంటూ ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇకపై ఆయా శాఖల అధికారుల నుంచి సచివాలయ ఉద్యోగులు డ్యూటీ సర్టిఫికెట్ తీసుకుని ఎంపీడీవో వద్దకు వెళ్లి కౌంటర్ సైన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు ఇస్తూ సర్క్యులర్‌ను జారీ చేశారు. హార్టికల్చర్ సిబ్బంది విధులు నిర్వహించే సచివాలయాల్లో కాకుండా మండల మండల పరిషత్ కార్యాలయంలో తమ సీటు ఏర్పాటు చేసుకుని అక్కడే పని చేయాలని, సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరుతో పాటు మూమెంట్ రిజిస్టర్‌లను ప్రతి నెల ఎంపీడీవోకు చూపించి సంతకం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సచివాలయ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేసే ముందు వారి హాజరుతో పాటు విధి, బాధ్యతలను పరిగణనలోనికి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విధులలో అలసత్వం వహించే సచివాలయ సిబ్బందికి ప్రత్తిపాడు ఎంపీడీవో ఆదేశాలు మింగుడుపడని విషయంగా మారింది.

సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన


సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తాడికొండలో పలుచోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామసభల్లో ఆమోదించిన 30 వేల పనులకు సంబంధించిన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కంతేరులో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, పొన్నెకల్లులో రూ.14 లక్షల వ్యయంతో, దామరపల్లి గ్రామంలో రూ.5 లక్షల వ్యయంతో పణిదరంలో రూ.9 లక్షల వ్యయంతో, నిడుముక్కల లో రూ.6 లక్షల వ్యయంతో, మోతడకలో రూ. 15 లక్షల వ్యయంతో, లచ్చన్నగుడిపూడిలో రూ.8 లక్షల వ్యయంతో, ముక్కామలలో రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రూ.75 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకుడు ఎడ్డూరి వీర హనుమంతరావు, మాజీ సర్పంచ్ నూతక్కి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నేతలు గురువారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. 23వ వార్డుకు చెందిన దాసరి కళావతికి రూ.97,196, 15వ వార్డుకు చెందిన బాదంగంటి కార్తీక్‌కు రూ.53,400, ఎన్‌సీసీ రోడ్డుకు చెందిన శిరందాస్ యోగప్రియకు రూ.44,406, కూరగాయల మార్కెట్‌కు చెందిన పూజల బాలయ్యకు రూ. 30,786, మార్కండేయ కాలనీకి చెందిన పందేటి తిరుపతయ్యకు రూ.27,941, షేక్ నసీమాకు రూ.30,786, ద్వారకానగర్‌కు చెందిన తిరుమలశెట్టి రాఘవేంద్రకు రూ.25,350 చొప్పున చెక్కులు మంజూరయ్యాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు కారంపూడి చిరంజీవి, కొదమల సైమన్, నక్కా రాజశేఖర్, దామర్ల రాంబాబు, కౌతరపు శ్రీను, వంగర హనుమాన్, నూతక్కి మోహన్, యెడ్లూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

● డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

తుళ్లూరు జనవరి 9(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని డీఆర్‌డీఏ పీడీ తాడిబోయిన విజయలక్ష్మి అన్నారు. తుళ్లూరు వెలుగు కార్యాలయంలో గురువారం ఎంఎస్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు, పిండి వంటల వంటకం, సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతపై గ్రూప్ డిస్కషన్ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు సంకల్పంతోనే మహిళలు ఆర్థికంగా నిలబడుతున్నారన్నారు. డ్వాక్రా రుణాల ద్వారా ఎంతో మంది మహిళలు వ్యాపారాలు స్థాపించి పలువురికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగటానికి డ్వాక్రా గ్రూపులను స్థాపించారన్నారు. అనంతరం మండల శ్రీవాణి సమాఖ్యలో ఎంఎస్, వీవోఏల సమీక్ష నిర్వహించారు. డీపీఎంలు అశోక్, నారాయణ, రాంబాబు, కేశవ, ఏపీవో కోటేశ్వరరావు, ఏపీఎం కొమ్మూరి చినవీరయ్య, ఎంఎస్ ప్రెసిడెంట్ బండి హరిత, సెక్రటరి కంభంపాటి మరియమ్మ, సీసీలు బుల్ల సుందరావు, కంతేటి మాధవి, ప్రతూరి కుమారి, కీర్తి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మంగళగిరి బ్రాంచ్ వారి సూచనలు పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా... అయినంపూడి రామమోహనరావు గారి కుమారుడు పెండెల కృష్ణారావు గారి ఆస్తిని తనఖా పెట్టుకొని అయినంపూడి జాగృతి గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియచేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ వారు అయినంపూడి జాగృతి గారికి ఋణము మంజూరు చేయును. షెడ్యూలు : కృష్ణా జిల్లా, విజయవాడ రిజిస్ట్రారు వారి పరిధిలోని, పటమట సబ్‌రిజిస్ట్రారు వారి పరిధి, కానూరు గ్రామ పంచాయితీ బోర్డు ఏరియాలో ... కానూరు గ్రామములో పైన సర్వేనెంబర్ 54/4, 52/1, 54/... ప్లాటు నెం. 69లో గజ. 266.66 ... స్థలమునకు హద్దులు : తూర్పు : ... ఉ. 40.0లు, దక్షిణం : ప్లాటు నెం. 59లో ... ఉ. 60.0లు, పడమర : ప్లాటు నెం. 69లో ... ఉ. 40.0లు, ఉత్తరం : ప్లాటు నెం. 54లో ... ఉ. 60లు. యీ హద్దుల మధ్య చ.గ. 266.66లు ... 222.96... DOC NO: 1371/2005, ... నెంబర్: 196/BK III/2024, S.R.O. పటమట.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

65మంది డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో జరిగిన మెగా జాబ్‌మేళాలో 65మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు టెక్ మహేంద్ర, సదరన్‌ల్యాండ్, పేటీఎం, కాన్‌సెంట్రిక్స్ కంపెనీలు విద్యార్థులకు మౌఖిక రాత పరీక్షలు నిర్వహించి, బృంద చర్చలు జరిపాయి. 65మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని సీఈవో ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ లాజర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం

● మంత్రి నాదెండ్ల మనోహర్



చెక్కు అందచేస్తున్న మంత్రి మనోహర్

తెనాలి మారీసుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఖాళీచేసి దివాలాతీయిస్తే కూటమి ప్రభుత్వం ఆ తప్పిదాలన్నింటిని సరిచేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. గురువారం పట్టణంలోని కొత్తపేట శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంత స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజ్ ద్వారా రుణాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి మనోహర్ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రూ.20కోట్ల 95లక్షల చెక్కులను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ తెనాలి మునిసిపల్ పరిధిలో స్వయం సహాయక సంఘాలకు రూ.5కోట్ల 21లక్షల 50వేలు మండల పరిధిలో రూ.15కోట్ల74లక్షల320లు వంతున మొత్తం రూ.20కోట్ల 95లక్షలు విడుదల చేశామన్నారు. కూటమి ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి చట్టాలను కఠినతరం చేశామన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే క్రైంరేట్ 90 శాతం అదుపులోకి వచ్చిందన్నారు. సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టులు పెడుతున్న వారిపై మహిళలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. తెనాలి ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా 'మన తెనాలి' వాట్సాప్ యాప్ 7659935993 ఫోన్ నెంబరును ఏర్పాటు చేశామని అందులో అన్ని శాఖల అధికారులను చేర్చడంతోపాటు తానుకూడా ఉన్నానని వివరించారు. మహిళలైనా, విద్యార్థులైనా, వ్యాపారులైనా ఇలా ఎవరైనా సరే సమస్య వస్తే గ్రూప్‌లో పోస్ట్ చేస్తే సత్వరమే పరిష్కారం చూపుతామన్నారు. మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న అధ్యక్షతన జరిగిన సభలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంపీడీవో అత్తోట దీప్తి, తెనాలి సిటీ మెప్మా మేనేజర్ విజయకుమారి, మండల అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కె.జయశ్రీ, కో ఆర్డినేటర్ ప్రమీలారాణి, డీసీలు రత్నకుమారి, ప్రసాద్, ఎస్.శ్రీనివాస్‌రావు, ఎం.రమాకుమారి ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేలపాడు రోడ్డు దుస్థితిపై మంత్రికి వినతి

తెనాలి నుంచి నేలపాడు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారిందని మంత్రి మనోహర్ దృష్టికి ఆ గ్రామ మహిళలు తీసుకువచ్చారు. స్వయం సహాయక సంఘాల నిధుల విడుదలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మనోహర్‌కు సభలో విన్నవించారు. దీనిపై మంత్రి మనోహర్ స్పందించి సంవత్సర కాలంలో రోడ్డు పూర్తి చేసేలా బాధ్యత తీసుకుంటానన్నారు.

తిరుమల ఘటన బాధాకరం

శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న మహిళను బయటకుతెచ్చి వైద్యం అందించేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నంలో తొక్కిసలాట జరిగి పలువురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన బాధాకరమని మంత్రి మనోహర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని కళాక్షేత్రంలో ఆయన మాట్లాడుతూ ఏకాదశి దర్శన టిక్కెట్ల కౌంటర్ల వద్ద జరిగిన ఘటన మనస్సును కలిచివేసిందన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మృతుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అర్జీలు స్వీకరించిన మంత్రి మనోహర్



జనసేన కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలోని పలువురు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గురువారం పట్టణానికి విచ్చేసిన ఆయన సాయంత్రం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఆ సమయంలో పలువురు మంత్రి మనోహర్‌ను కలిసి వారి సమస్యలను విన్నవించి అర్జీలను అందించారు. మంత్రి మనోహర్ వారు తెలిపే ప్రతి సమస్యను ఓర్పుగా వింటూ త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మున్నంగి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



మున్నంగిలో విద్యార్థులకు భోగిపళ్లు పోస్తున్న విద్యార్థుల తల్లులు, ఉపాధ్యాయులు

కొల్లిపర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొని రంగవల్లికలు, హరిదాసు, ముగ్గుల్లో గొబ్బిమ్మలు, భోగి మంటలు వేశారు. ముగ్గులు చుట్టూ తిరుగుతూ చిన్నారులు పాడిన పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు భోగిపళ్లు పోశారు. అనంతరం ఎంఈవో ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయుడు రాము, విద్యాకమిటీ చైర్మన్ షేక్ సంజీదాసుల్తానా, ఉపాధ్యాయురాలు సోమరౌతు లక్ష్మీకమల ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేశారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి: డీఈవో సీవీ రేణుక

గుంటూరు (విద్య) జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి సంబరాలు నిలుస్తాయని డీఈవో సీవీ రేణుక అన్నారు. గురువారం పెదకాకాని మండలం వెనిగండ్ల జడ్పీ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ఆమె మాట్లాడారు. సంక్రాంతి తెలుగు లోగిళ్లలో సుఖ, సంతోషాలను నింపుతుందన్నారు. భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దుల ఆటపాటలు ఎంతోముచ్చటగా సాగుతాయన్నారు. ఇటువంటి సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, హెచ్‌ఎం ఎస్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి: హరికిషోర్

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి ,సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యత నేటితరంపై ఉందని పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజర్ కొప్పురావూరి హరికిషోర్ చెప్పారు. బోసురోడ్డులోని శ్రీవాసవి ఆలయంలో పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి యూత్, ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సంఘ నాయకులు హేమరామకృష్ణ, అమరేంద్రకుమార్, అశోక్‌కుమార్, బదరీ కిరణ్, సతీష్‌కుమార్, తుక్కయ్య, అనీల్‌కుమార్ పర్యవేక్షించారు.

మాంటిస్సోరి పాఠశాలలో...

తెనాలి అర్బన్ జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నందులపేటలోని మాంటిసోరి స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గొబ్బెమ్మలు, రంగవల్లులతో తీర్చి దిద్ది, పూలతో అలంకరించారు. ప్రిన్సిపాల్ జేమ్స్ మొరెలి మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు సంక్రాంతి నెలవన్నారు. సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చిన్నారులకు భోగి పళ్ళు పోసి ఆశీర్వదించారు. సంప్రదాయ దుస్తుల్లో బాలబాలికలు అలరించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ, రేఖ, శారద, తదితరులు పర్యవేక్షించారు.



మాజీ మంత్రి దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం

● మాజీ మంత్రి అంబటి రాంబాబు

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ సేవలు చిరస్మరణీయమని గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం మాజీ మంత్రి, ఏఎస్ఎన్ కళాశాలల వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ 33వ వర్ధంతిని తెనాలిలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఏఎస్ఎన్ కళాశాల వద్ద ఆయన చిత్రపటానికి అన్నాబత్తుని కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మందపాటి శేషగిరిరావు, శివరామకృష్ణారెడ్డి, అన్నాబత్తుని అభిమానులు, వైసీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐతానగర్‌లోని స్మృతివనం వరకూ ర్యాలీగా వెళ్లి సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మాజీ మంత్రులు రాంబాబు, మేరుగ నాగార్జునలు మాట్లాడుతూ తెనాలి ప్రాంత అభివృద్ధికి తొలిబీజం వేసింది మాజీ మంత్రి దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ అన్నారు. తెనాలి ప్రాంతంలో మునిసిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి ప్రజానాయకుడిగా చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన తండ్రి ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ ప్రజాసేవకు అంకితమయ్యారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మునిసిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, కొల్లిపర ఎంపీపీ పద్మావతి, సంజీవరెడ్డి, అత్తోట నాగవేణి, వైసీపీ కౌన్సిలర్లు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల నివాళి

మాజీ మంత్రి దివంగత సత్యనారాయణ 33వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు పెద్దకుమారుడు టీడీపీ నాయకుడు అన్నాబత్తుని శ్రావణ్‌కుమార్, జయలక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు ఐతానగర్‌లోని సత్యనారాయణ సమాధి వద్ద నివాళులర్పించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మదర్ థెరిస్సా సొసైటీ సహకారంతో పాఠశాల పిల్లలకు పుస్తకాలు, పలకలు, పెన్నులు పంపిణీ చేశారు. యడ్ల లింగయ్య కాలనీలోని ఎస్‌కేసీ స్కూల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మల్లికార్జునరావు, మౌలాలి, రేష్మా, ప్రవీణ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పొన్నూరు టౌన్, జనవరి 9: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం జీబీసీ రోడ్డులో పట్టణ శివారు వద్ద కాపు కాసి అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యంను, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. అంతేకాకుండా మామిళ్లపల్లిలో మిరియాల రేణుకయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 9.83 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పొన్నూరులో నిరసన తెలుపుతున్న బ్రాహ్మణ సంఘాలు

అర్చకుడిపై దాడికి బ్రాహ్మణ సంఘాల నిరసన

పొన్నూరు టౌన్, జనవరి 9: పొన్నూరు పట్టణంలోని దేవాలయంలో పనిచేసే అర్చకుడు నాగేశ్వరశర్మపై దాడి దారుణ చర్య అని బ్రాహ్మణ మహా సభ నాయకులు ఖండించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు నాగేశ్వరశర్మపై జరిగిన దాడికి నిరసనగా గురువారం బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో తెలగపాలెం కోదండ రామాలయం వద్ద నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. నాగేశ్వరశర్మపై దాడిచేసిన విజయ్‌దినకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణుల ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, రాష్ట్ర అర్చక పురోహిత సంఘ నాయకులు, భారతీయ జనతా పార్టీ, ఆర్‌ఎస్ఎస్, భజరంగ్ దళ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుల నిరసన ప్రదర్శన గురించి తెలుసుకున్న అర్బన్ సీఐ రవికిరణ్, సంఘటన స్థలానికి చేరుకుని బ్రాహ్మణ మహాసభ నాయకులతో చర్చించారు. దాడి సంఘటన గురించి ఫిర్యాదుచేస్తే నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఖాజీపేట హోటల్ వ్యాపారి ఆచూకీ లభ్యం

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేటకు చెందిన హోటల్ వ్యాపారి తిరుమలశెట్టి రాధాకృష్ణమూర్తి గత ఆదివారం సరుకులు కోసం కొలకలూరు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీనిపై రూరల్ పోలీస్ స్టేషన్లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు అతడు కారంపూడి వద్ద ఉన్నట్లు గుర్తించారు. శుక్రవారం అతడిని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

11న పట్టభద్రుల ఆత్మీయ సమావేశం: తాడిబోయిన

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఆత్మీయ సమావేశానికి తెనాలి, వేమూరు నియోజకవర్గాల గ్రాడ్యుయేట్ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ నెల 11న శనివారం ఉదయం 10 గంటలకు ఆలపాటి నగర్‌లోని తెనాలి రత్న ఫార్చ్యూన్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి కృష్ణ, గుంటూరు జిల్లాల కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు, రెండు నియోజకవర్గాల్లోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, మునిసిపల్ కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనిత, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కంచర్ల ఏడుకొండలు, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

22న అంగలకుదురులో సీతారాముల కల్యాణం

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి సంవత్సరం పూర్తికావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు అంగలకుదురు దాసకుటి ఆశ్రమ నిర్వాహకులు ఉలిచి సీతారామశర్మ (పట్టాభి) చెప్పారు. గురువారం కార్యక్రమాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బీజేపీ నాయకులు కడియాల నందకిషోర్, కె.సునీల్, అవ్వారు శ్రీనివాసరావు, హిందూ చైతన్యవేదిక రాష్ట్ర కో కన్వీనర్ అంబటి మారుతీరామ్, హిందూ చైతన్య వేదిక జిల్లా కార్యదర్శి ఉల్లగంటి శ్రీనివాస్ ఇతర సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతారామశర్మ మాట్లాడుతూ భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హనుమత్‌ప్రసాద్, బి.సుబ్బారావు, రామాంజనేయులు, కనగాల హరి, సి.తాతారావు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన న్యాయవాదుల దీక్ష

పొన్నూరు టౌన్, జనవరి 9: పొన్నూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాద రిలే నిరాహార దీక్షలు గురువారం మూడో రోజుకు చేరింది. న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై జరిగిన దాడిని ఖండిస్తూ బాధ్యులైన పోలీసు అధికారులు ప్రభుత్వ వైద్యుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు. రిలే దీక్షల్లో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, గుమస్తాలు పాల్గొన్నారు.

తెనాలిలో...

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులో న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడాన్ని కుల నిర్మూలన పోరాట సమితి కార్యకర్తలు నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ ఆధ్వర్యంలో గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనచేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చార్లెస్, కోటేశ్వరరావు, పోతురాజు, ప్రభాకర్, బెన్‌హర్, బసవయ్య, రవిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చిరు వ్యాపారాలకు ప్రణాళిక

● మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ

తెనాలి, మారీసుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ సెంటర్‌లో చిరువ్యాపారుల వలన ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వారు తమ వ్యాపారాలను నిర్వహించుకునేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్థానిక మార్కెట్ సెంటర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా కూరగాయలు, పండ్లు, ఆకు కూరలను విక్రయిస్తున్న చిరువ్యాపారులు నిర్ణీత ప్రాంతాలలో తమ వ్యాపారాలను నిర్వహించేలా మార్కింగ్ చేయడానికి మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, ఏసీపీ శివన్నారాయణ, ఆర్వో రాంప్రసాద్‌లతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు, చైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. పెదరావూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారకా శ్రీను, శివకుమార్ శంకరరావు, బ్రహ్మయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కొల్లిపర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కె.హైమావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

వైకుంఠపురం ముక్కోటి ఏర్పాట్లపై డీఎస్పీ పరిశీలన



వైకుంఠపురంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, ఈవో అనుమప

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినానికి ఏర్పాట్లను డీఎస్పీ బి.జనార్దనరావు పరిశీలించారు. తిరుమల టోకెన్ల జారీ సంఘటన నేపథ్యంలో ఇక్కడచేస్తున్న ఏర్పాట్లను ఈవో అనుపమను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన ఆలయం, ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులు తిరిగి వెళ్ళే ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లను తనిఖీచేశారు. ఆలయ అర్చకులు దేవాలయ సిబ్బందికి సూచనలు చేశారు. సీఐ, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. ట్రస్టు బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు, రూరల్ సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు, అర్చక, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏడువేల మందికి అన్నదానం ఏర్పాట్లు

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని వైకుంఠపురం ఆలయానికి వచ్చే 7వేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఈవో అనుపమ తెలిపారు. మెరుగైన సౌకర్యాలను కల్పించి భక్తులు స్వామివారిని త్వరితగతిన దర్శించుకుని వెళ్ళేలా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. రూ.150, రూ.300, శీఘ్ర, వీఐపీ దర్శనాలతో పాటు ఉచిత దర్శనం కల్పిస్తున్నామన్నారు. ప్రతి భక్తుడికి దక్షిణావృత శంఖుతీర్థం అందజేస్తామన్నారు.

మూడు రోజుల పాటు శాస్త్రీయ సంగీత కచేరీలు

తెనాలి అర్బన్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మూడు రోజులు శాస్త్రీయ సంగీత కచేరీలు నిర్వహిస్తామని ఏవీ రామకృష్ణ తెలిపారు. బోసురోడ్డులోని శ్రీవాసవి ఆలయ ప్రాంగణంలో సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో భక్తి రంజని కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ములుకుట్ల విశ్వనాథశర్మ ముక్కోటి విశిష్టతపై ప్రవచనం, అన్నమాచార్య సంకీర్తన జరుగుతుందన్నారు.

సంక్షేమ ప్రదాత ఎన్టీఆర్: ఈదర

తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ ప్రదాతగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని టీడీపీ రాష్ట్ర వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ అన్నారు. 1983 జనవరి 9న మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పార్టీని గెలిపించుకుని ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికి 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని వాణిజ్యవిభాగ అధికార ప్రతినిధి కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి పార్టీ నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చేందుకు ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన కిలో రూ.2 బియ్యం, పక్కా ఇల్లు, ఇతర పథకాలను మననం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు, మంగళగిరి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యాయసంఘం అధ్యక్షుడు వి.నరసింహారావు, తెనాలి నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, పి.రాంబాబు, వైష్ణవి కళాశాల కరస్పాండెంట్ పి.శ్రీనివాసరావు, కె.ఉపేంద్ర, నరేంద్ర, అంచా రాంచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు

తెనాలి, మారీసుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 26మంది ఉద్యోగాలకు ఎన్నికైనట్లు ఆ సంస్థ అధికారి సంజీవరావు తెలిపారు. గురువారం స్థానిక ఈఈ కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ ప్రాంతాలకు చెందిన ఐదు కంపెనీల ప్రతినిధిలు పాల్గొని 74మంది అభ్యర్థులకు గాను 26 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ తెనాలి సాధ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ తెనాలిని సాధించాలంటే అది ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం వద్ద గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ బండి శేషన్నతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాలతో గత సంవత్సరంలో స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024 కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మెప్మా ఆర్పీలు, నగర దీపికలు, ఏఎన్ఎంలు, వార్డు శానిటరీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

● రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్





తెనాలి రూరల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం తప్పనిసరని దీంతో ప్రాణాపాయం తప్పుతుందని రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ చెప్పారు. హెల్మెట్ ధరించడంపై గురువారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: హెల్మెట్ ధరించడంపై అవగాహన చేపడుతున్నారా?

జ: హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎప్పటికప్పుడు వాహనదారుల్లో అవగాహన పెంచుతున్నాం. జుట్టురాలుతుందని కొందరు అపోహలతో హెల్మెట్ ధరించి వాహనం నడిపేందుకు వెనుకాడుతున్నారు. సురక్షితంగా గమ్యస్థానానికి చేరడం ప్రధానమన్న విషయాన్ని గ్రహించి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హెల్మెట్ ఉంటే ఏదైనా రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నా తలకు గాయంకాకుండా ఉంటుంది. ద్విచక్ర వాహనదారుల్లో ఎక్కువగా ప్రమాదాల్లో తలకు గాయాలై మృతిచెందిన వారే ఎక్కువగా ఉన్నారు.

ప్రశ్న: హెల్మెట్ ధరించని వారికి ఎటువంటి పెనాల్టీలు విధిస్తున్నారు?

జ: హెల్మెట్ ధరించకుండా తొలిసారి పట్టుబడితే స్వల్ప రుసుము కింద రూ.100విధిస్తాం. అప్పటికీ మార్పు రాకపోతే కౌన్సెలింగ్‌తో పాటు జరిమానా విధించటంతో పాటు, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.


ప్రశ్న: ఎటువంటి హెల్మెట్లు వాడాలి?

జ: ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్లు మాత్రమే తలకు ధరించాలి. ఇవి అనేక పరిశోధనలు చేసిన తరువాత సురక్షితమని గుర్తించి మార్కెట్లోకి విడుదల చేస్తారు. ఈ మార్కు లేనివి ధరించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

ప్రశ్న: మైనర్లు వాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జ: మైనర్లు వాహనం నడపరాదని చట్టం స్పష్టంగా చెబుతుంది. అయినా అతిక్రమించి నడిపితే వాహనం ఇచ్చిన యజమానులు, తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటాం. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవొద్దు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 10 జనవరి 2025



సహజయోగ

సహజ సంక్రాంతి

'సం'-క్రాంతి' అనే పదంలో 'సం' అంటే 'శుభం' అని, 'క్రాంతి' అంటే 'పరివర్తన' లేదా 'విప్లవం' అని అర్థం. 'సంక్రాంతి' అంటే శుభకరమైన పరివర్తన తెచ్చే రోజు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని 'మకర సంక్రమణం' అంటాం. ఆ రోజు నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. అప్పటివరకూ దక్షిణ దిక్కున ప్రయాణించిన సూర్యుడు తన దిశను మార్చుకొని... ఉత్తర దిక్కులో సంచారం మొదలుపెడతాడు. సూర్యుడి గమనం మారడం వల్ల... వాతావరణంలో మార్పులు వస్తాయి.

సమస్త సృష్టికి ఆధారభూతుడు సూర్య భగవానుడు. ఆయన అనుగ్రహం లేకపోతే మానవాళికి మనుగడ లేదు. తను నిరంతరం మండుతూ సమస్త విశ్వానికి మేలు చేకూరుస్తాడు. ఇతరులకు ఆనందం కలిగిస్తాడు. ఈ గుణాలు మనలో పెంపొందించుకుంటే అహంకారానికి తావుండదు. రాత్రి చీకటి వల్ల మనం నిద్రావస్థలో ఉంటాం. సూర్యుడు ఉదయించాక... ఆయన ప్రకాశం వల్లనే పనులన్నీ జరుగుతాయి. కాబట్టి అన్ని కార్యాలను ప్రభావితం చేసేది సూర్యుడే. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... మిగిలిన పండుగలన్నీ చంద్రుని గమనం ఆధారంగా జరుపుకొంటే... సంక్రాంతిని సూర్య గమనాన్ని పరిగణనలోకి తీసుకొని జరుపుకొంటాం. అందుకే ఇది చాలా ముఖ్యమైన రోజు.

పెద్ద పండుగ

సంక్రాంతి పండుగ సమయానికి ధాన్యం పొలాల నుంచి ఇంటికి చేరుకుంటుంది. చేతికి వచ్చిన పంటను చూసి రైతులు ఆనందంతో పొంగిపోతారు. కొత్త బియ్యానికి బెల్లం జోడించి పరమాన్నం, అప్పాలు, అలాగే అరిసెలు, చక్కిలాలు లాంటివి తయారు చేస్తారు. తమిళనాడులో కొత్త బియ్యంతో పొంగలి చేస్తారు, అందుకే ఈ పండుగను అక్కడ 'పొంగల్' అని పిలుస్తారు. పంటను ప్రసాదించిన దేవుడికి ధన్యవాదాలు తెలుపుతూ... తాము తయారు చేసిన వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ పండగ సందర్భంగా ప్రకృతిని, పశువులను కూడా పూజిస్తారు. మొదటి రోజున భోగీ, రెండో రోజు మకర సంక్రాంతి మూడో రోజు కనుమ... మొత్తంగా ఇది ప్రధానమైన పండుగ. పల్లెల్లో దీన్ని ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ధాన్య లక్ష్మికి స్వాగతం చెప్పడానికి ఇంటి గుమ్మాలను మామిడి కొమ్మలతో, పూల దండలతో, వాకిళ్ళను రంగవల్లులతో, వాటిలో ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరిస్తారు. సంక్రాంతి జానపద కళా సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, రంగవల్లుల పోటీలు తదితరాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి. మూడో రోజు కనుమ రైతులకు అత్యంత ప్రీతిపాత్రమైనది. వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటూ ధాన్య రాశులను ఇంటికి తీసుకురావడానికి సహాయం చేసిన పశువులకు కృతజ్ఞతతో పూజలు జరుపుతారు.

> సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి సాధించాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి.

సమతుల్యత ప్రధానం

మానవ చరిత్రలో సంభవించిన అనేక విప్లవాల గురించి మనకు తెలుసు. రాజకీయపరమైనవీ, అసమానతల నిర్మాణం కోసం ఉద్దేశించినవి అయిన ఇలాంటి విప్లవాలతో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు సాధ్యమయ్యాయి. కానీ మానవులు సంపూర్ణమైన ఆధ్యాత్మిక ఉన్నతి మాత్రం సాధ్యపడలేదు. అది జరగాలంటే మనలో అంతర్గతంగా విప్లవం లేదా పరివర్తన రావాలి. అలాంటి పరివర్తనకు మనలో నిగూఢంగా ఉన్న మాతృశక్తి అయిన కుండలీని శక్తి మనకు చాలా సాయం చేస్తుంది. సహజయోగ ధ్యాన సాధన ద్వారా లభించే ఆ అంతర్గత పరివర్తనే సహజ సంక్రాంతి. మన సూక్ష్మ శరీరంలో సూర్యుడి స్థానం మన నుదుటి భాగంలోని ఆజ్ఞాచక్రంలో ఉంటుంది. ముందుగా దాన్ని శుభ్రపరచుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే అది సూర్యుడి ద్వారా ప్రభావితం అవుతుంది. ఆజ్ఞాచక్రం సరిగ్గా లేకపోతే మనకు చాలా త్వరగా కోపం వస్తుంది. మనలో క్షమాగుణాన్ని పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే ఆజ్ఞాచక్రాన్ని శుభ్రంగా ఉంచుకోగలం. అందుకే క్షమాగుణం అలవరచుకోవడం చాలా ముఖ్యం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే... సూర్యచంద్రుల గమన ప్రభావం మనపై బాహ్యంగానే కాదు... అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థ మీద కూడా ఉంటుంది. మనలో ఎడమవైపున 'ఇడానాడి' అంటే చంద్రనాడి, కుడివైపు 'పింగళానాడి' అంటే సూర్యనాడి ఉంటాయి. సూర్యనాడి క్రియాశక్తిని, చంద్రనాడి ఇచ్ఛాశక్తిని సూచిస్తాయి. మనం శక్తికి మించిన పని చేసినప్పుడు లేదా అతిగా ఆలోచిస్తున్నప్పుడు కుడి భాగం మీద భారం పడుతుంది. శరీరంలో ఉష్ణం ఎక్కువై అది బలహీనపడుతుంది. ఇక ఏ పనీ చేయాలనే కోరిక లేకుండా, ఎప్పుడూ సోమరితనంతో ఉండేవారిలో చంద్రనాడికి, అంటే ఎడమ పార్శ్వానికి సంబంధించి నసమస్యలు వస్తాయి. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు ఏదీ అతిగా ఉండకూడదు. దీనివల్ల మనలో ఉండే సహజమైన సమతుల్యత విచ్ఛిన్నం అవుతుంది. కాబట్టి మనలోని సూర్యనాడిని, చంద్రనాడిని ప్రతి నిత్యం ధ్యానం ద్వారా సమతుల్య స్థితిలో ఉంచుకోవాలి. అది సహజయోగ ధ్యానం ద్వారా సాధ్యమవుతుంది.



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

హరేకృష్ణ

అప్పుడు ఇల్లే వైకుంఠం

నేడు వైకుంఠ ఏకాదశి

వైకుంఠ ఏకాదశి మహాపర్వదినానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ రోజున సంభవించిన దైవ లీలలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి: విష్ణు సేవకులలో ఒకడైన పరమభక్తుడు ఈ భౌతిక ప్రపంచంలో తన ప్రయాణాన్ని ముగించి, విష్ణులోకానికి వెళ్ళిన సందర్భం. ఆ విశిష్ట భగవత్ సన్నిధానానికే 'వైకుంఠం' అని పేరు. 'విగత కుంఠ యస్మాద్ వైకుంఠ'... 'విగత' అంటే 'పోయినది' అనీ, 'కుంఠ' అంటే 'ఆందోళన', 'ఆత్రుత', 'ఆవేదన' అని అర్థం. ఏ ప్రదేశంలోనైతే ఆతృతకు, ఆందోళనకు, ఆవేదనలకు తావులేదో... ఆ ప్రదేశమే వైకుంఠం.

వైకుంఠాలు అనేకం. మనం నృసింహ భగవానుడి పట్ల ఆకర్షితులమైతే... ఆ నృసింహ వైకుంఠానికి చేరుకుంటాం. అలాగే కేశవ, మాధవ, గోవింద, మధుసూదన, శ్రీరామ తదితర రూపాల పట్ల ఆకర్షితులైనవారు సంబంధిత వైకుంఠాలను చేరుకుంటారు. సాక్షాత్తూ వైకుంఠనాథుడైన శ్రీమహావిష్ణువు స్వయంగా వైకుంఠద్వారం వద్దకు వచ్చి, తన ప్రియభక్తుణ్ణి స్వాగతించడమే వైకుంఠ ఏకాదశి విశిష్టత. భగవత్సందేశాన్ని లోకానికి బోధించే భక్తునికన్నా తనకు ప్రియమైనవారు మరొకరు లేరని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు వివరించాడు. ఈ శుభ తిథినాడు వైకుంఠ ద్వారంలోనికి ప్రవేశించి, ఉత్తర ద్వారం వద్ద ఆసీనుడైన భగవంతుణ్ణి దర్శనం చేసుకున్నవారు... మోక్షానికి అర్హత పొందుతారని, ప్రస్తుత దేహాన్ని త్యజించిన తరువాత వైకుంఠానికి చేరగలరని శాస్త్రోక్తి. మనమందరం ఈ భౌతిక ప్రపంచమనే అసహజమైన నివాసంలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నాం. ఆత్రుత, ఆవేదనల మధ్య కొనసాగే జీవన పోరాటంలో విసిగిపోతూ ఉంటాం. ఇలాంటివాటిని మనలో ఎవరూ కోరుకోం. ఎన్ని భోగభాగ్యాలు ఉన్నా... అంతరంగంలో ఏదో ఒక వెలితి ఉండనే ఉంటుంది. మన నిజ నివాస స్థానమైన ఆ భగవత్సన్నిధానంలో మనం లేకపోవడమే ఆ వెలితి. మరి ఎక్కడికి ఎలా చేరుకోగలం? మన అసలైన ఇంటికి తిరిగి వెళ్ళడం ఎలా? వైకుంఠనాథుడైన ఆ విష్ణుమూర్తిని లేదా నారాయణుణ్ణి లేదా శ్రీకృష్ణుణ్ణి దర్శించడం ఎలా? సామాన్య జనులకు ఈ మార్గ నిర్దేశం చేయడానికే విశుద్ధ భక్తులు ఈ లోకంలో అవతరిస్తూ ఉంటారు.

మన కర్తవ్యమేమిటి?

వైకుఠం అనేది కేవలం 'ఒక భౌతికాతీతమైన లోకం' మాత్రమే కాదు. ఎలాగైతే విష్ణు భగవానుడు విస్తరించి... ఒక ఆలయంలో మూర్తిగా వెలసి, మనకు దర్శనం ఇస్తాడో... అదే విధంగా వైకుఠం కూడా విస్తరించగలదు. ఈ కలియుగంలో శ్రీకృష్ణుడి





పవిత్రనామాలను ఎవరు జపిస్తారో... వారి ఇంట్లోకి వైకుంఠమే స్వయంగా ప్రవేశిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతో కలిసి భగవన్నామాలను జపిస్తూ... మన ఇంటినే వైకుంఠంగా తీర్చిదిద్దుకోవచ్చు. కాబట్టి 'హరే కృష్ణ హరే రామ' నామాలను జపించండి. మీ ఇంటిని వైకుంఠంగా మార్చుకోండి. తదుపరి జన్మలో దివ్య వైకుంఠ లోకానికి తిరిగి వెళ్ళండి. అదే ప్రతి జీవునికీ అంతిమ లక్ష్యం.

వైకుంఠ ఏకాదశిని ఎలా జరుపుకోవాలి?

. ఈ రోజు ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలి. ధాన్యాలు, పప్పు దినుసులు భుజించకూడదు. పండ్లు, పాలు, సగ్గుబియ్యం లాంటివి తీసుకోవచ్చు

. విష్ణు ఆలయాన్ని సందర్శించాలి. విష్ణు నామాన్ని జపిస్తూ వైకుంఠ ద్వారంలోకి ప్రవేశించాలి. ఆలయంలో తీర్థ ప్రసాదాలు స్వీకరించాలి.

. హరేకృష్ణ మంత్రాన్ని జపించాలి, కనీసం నూట ఎనిమిది సార్లు పఠించడం ఉత్తమం.

. భగవద్గీత లేదా శ్రీమద్భాగవతాన్ని పఠించాలి.

. నిత్యాన్నదానానికి లేదా గోసేవకు దానధర్మాలు చేస్తే మంచిది.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

భక్తులకు రంగుల తోవ!

స్టేషన్లోకి వచ్చే, వెళ్లే దారులు వేర్వేరుగా

ప్లాట్ ఫాంపైకి నేరుగా ఎవరూ వెళ్లలేరు

తొక్కిసలాట నివారణకు రైల్వే ఏర్పాట్లు

9 స్టేషన్లలో 1186 సీసీ కెమెరాలు

వాటిలో 116 ఏఐ ఆధారిత ముఖ గుర్తింపువి

నలుదిశలకూ నాలుగు రంగుల ప్రాంగణాలు



కమాండ్ కంట్రోల్ రూమ్

(ప్రయాగ్ రాజ్ కుంభమేళా ప్రాంగణం నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాటలను నివారించడానికి పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు రంగులతో దారి చూపిస్తామంటున్నారు నార్తర్న్ సెంట్రల్ సీపీఆర్వో శశికాంత్ త్రిపాఠి. క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్లు తీసుకోవడానికి ఏర్పాట్లు చేయడమే కాకుండా ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు కెమెరాల ద్వారా తప్పిపోయిన వాళ్లనూ గుర్తిస్తామంటున్నారు. ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి మాటామంతీ..

ప్రయాగ్ రాజ్‌కు లక్షల మంది వస్తారు. రైల్వే స్టేషన్లలో తొక్కిసలాట వంటి ఘటనలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

సాధారణంగా తొక్కిసలాట వంటి ఘటనలు వెళ్లే వాళ్లు, వచ్చే వాళ్లు ఒకే మార్గంలో ఉన్నప్పుడు ఎక్కువగా జరుగుతుంటాయి. అందుకే, రైల్వే స్టేషన్లలో లోపలికి వచ్చే, బయటకు వెళ్లే దారులను వేర్వేరు చేసేశాం. వచ్చే వాళ్లు సిటీ లైన్ దిశగా వస్తే.. వెళ్లే వాళ్లను సివిల్ లైన్ దిశగా మళ్లిస్తున్నాం. అలాగే, ప్లాట్ ఫాంపైకి నేరుగా ఎవరూ వెళ్లలేరు. అందరూ ఒకేసారి రాకుండా నియంత్రించడానికి నాలుగు ప్రత్యేక ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశల్లో వెళ్లే వారిని ఆయా ప్రాంగణాల్లో ఉంచి.. అక్కడి నుంచి ప్లాట్ ఫాంలపైకి పంపిస్తాం?

భక్తుల్లో ఎవరు.. ఎక్కడి నుంచి వచ్చారు? అన్నది ఎలా గుర్తిస్తారు!?

ఇందుకు నాలుగు దిశలకు నాలుగు రంగుల (పసుపు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ) ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. లఖ్‌నవూ, బనారస్ దిశగా వెళ్లాలంటే ఎరుపు రంగు ప్రాంగణంలోకి వెళ్లాలి. ఉదాహరణకు.. హైదరాబాద్‌కు ఎవరైనా వెళ్లాలనుకోండి. వారిని పసుపు రంగు ప్రాంగణంలోకి పంపిస్తాం. ఇక్కడ మంచినీళ్లు, మరుగుదొడ్ల నుంచి చార్జింగ్ స్టేషన్లు కూడా ఏర్పాటు చేశాం. ఒక్కో ప్రాంగణంలో ప్రత్యేకంగా దాదాపు 20 టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ టికెట్ తీసుకున్న తర్వాత ప్రాంగణంలోనే వేచి ఉంటారు. వారి రైలు వచ్చినప్పుడు మాత్రమే అక్కడి వలంటీర్లు వారిని ప్రత్యేక మార్గంలో ప్లాట్‌ఫాంపైకి పంపిస్తారు.

ఒక్కో ప్రాంగణంలో ఎంతమంది పడతారు?

ఇక్కడ ఒకేసారి 5000 మంది ఉండడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. అంటే, నాలుగు ప్రాంగణాల్లో కలిపి ఒకేసారి 20 వేల మంది వచ్చినా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. దాదాపు పది వేల మంది సిబ్బంది ఈ మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించనున్నారు. 200 మంది వరకూ వలంటీర్లు ఉంటారు. వారికి ఇప్పటికే వివిధ భాషల్లో శిక్షణ ఇచ్చాం. ఇదంతా అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికుల కోసమే. రిజర్వ్‌డ్ ప్రయాణికుల కోసం ప్రత్యేక ప్రాంగణం, ప్రత్యేక మార్గం ఉన్నాయి.

మేళాలో ఎవరైనా తప్పిపోవడం లేదా అసాంఘిక శక్తులు చొరబడటం వంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ఏం చేయబోతున్నారు?

ప్రయాగ్‌రాజ్‌లో మొత్తం తొమ్మిది రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 1186 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఒక్క ప్రయాగ్‌రాజ్ ప్రధాన స్టేషన్లోనే 384 కెమెరాలు ఉన్నాయి. వీటిలో 116 ఏఐ ఆధారిత ముఖాన్ని గుర్తించే సీసీ కెమెరాలు. ఎవరైనా తప్పిపోయారనుకోండి. వారి ఫొటో మాకు ఇస్తే.. ఏఐ కెమెరాల పరిధిలో వాళ్లు ఉంటే వెంటనే మాకు తెలిసిపోతుంది. ఏ కెమెరా పరిధిలో ఉన్నారో తెలుసుకుని వారిని గుర్తిస్తాం. అలాగే, కొంతమంది అసాంఘిక శక్తుల డేటాను ఇప్పటికే నమోదు చేశాం. ఒక వేళ వాళ్లు ఎవరైనా ఈ కెమెరాల పరిధిలోకి వస్తే వెంటనే మాకు తెలిసిపోతుంది.

రైళ్ల ద్వారా ఎంతమంది వస్తారని భావిస్తున్నారు? ఎన్ని రైళ్లను అందుబాటులో ఉంచుతున్నారు?

కుంభ మేళాకు దాదాపు 40 కోట్ల మంది వస్తారని అంచనా వేస్తున్నారు. వారిలో కోటి మంది వరకూ రైళ్ల ద్వారానే వస్తారని భావిస్తున్నాం. ఇందుకు కుంభమేళా జరిగే 45 రోజులపాటు 13 వేల రైళ్లను ఏర్పాటు చేస్తున్నాం. వీటిలో 3000 వరకూ ప్రత్యేక రైళ్లే. అలాగే, దాదాపు పది వేల వరకూ పాసింజర్ రైళ్లు. కుంభమేళా మొత్తంలో మౌనీ అమావాస్యను అత్యంత పవిత్రమైన రోజుగా భావిస్తారు. ఆరోజు పెద్ద సంఖ్యలో వస్తారు. ఆ ఒక్కరోజే 350 రైళ్లను ఏర్పాటు చేశాం.



సీపీఆర్వో శశికాంత్ త్రిపాఠి

ఇక్కడి రైల్వే స్టేషన్లు ఒకేరోజు 350 రైళ్లు వస్తే తట్టుకోగలవా!?

సాధారణ రోజుల్లోనే ఇక్కడి మొత్తం 9 స్టేషన్లకు సరాసరిన 200 రైళ్లు వస్తూ పోతూ ఉంటాయి. ఇప్పుడు మరో 150 అదనంగా వస్తాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. వచ్చే, వెళ్లే దారులను వేర్వేరు చేసేశాం. రెండూ కలవకుండా మూసేస్తున్నాం. ఒకవేళ వెళ్లే వాళ్లు ఎవరైనా ప్రవేశ ద్వారం వైపు వస్తే చుట్టుతిరిగి మళ్లీ వెళ్లాల్సిందే. అలాగే, తమిళం, తెలుగు, కన్నడ సహా మొత్తం 12 భాషల్లో అనౌన్స్‌మెంట్లు ఇవ్వనున్నాం. ఒక బుక్‌లెట్‌లో కుంభమేళా రైళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుంది. అలాగే, కుంభ్ రైల్ సేవా 2025 అనే యాప్ తెస్తున్నాం. దాని ద్వారా టికెట్లు తీసుకోవడంతోపాటు పూర్తి వివరాలూ తెలుసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ ద్వారా టికెట్ తీసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.



ముత్యాల ముగ్గు





21 చుక్కలు, సరిచుక్క 1 వచ్చేవరకు

మొగలపు అనూష
ఖమ్మం

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

ఈ-మెయిల్:
features@andhrajyothy.com